RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 344 బుధవారం 7 జనవరి 2026 పేజీలు : 4 వెల : రూ.

## రోడ్డు ప్రమాదాలకు ఇకపై కాంట్రాక్టర్‌కు జరిమానా

న్యూఢిల్లీ : రోడ్డు ప్రమాదాలు, మరణాలను తగ్గించేందుకు జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. బీవోటీ (నిర్మాణం-నిర్వహణ-బదిలీ) పద్ధతిలో నిర్మించిన జాతీయ రహదారుల నిర్దిష్ట పరిధిలో (500 మీటర్లు) ఏడాదిలో ఒకటి కంటే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగితే కాంట్రాక్టర్లపై రూ.25 లక్షల జరిమానా విధించనున్నట్లు ప్రభుత్వ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ బీవోటీ డాక్యుమెంట్‌ను సవరించిందని రోడ్డు రవాణా, హైవేల శాఖ కార్యదర్శి వి.ఉమాశంకర్ తెలిపారు. కాంట్రాక్టర్లు రోడ్డు ప్రమాదాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఒక ఏడాదిలో హైవేలోని నిర్దిష్ట పరిధిలో ఒకటి కంటే ఎక్కువసార్లు రోడ్డు ప్రమాదాలు జరిగితే సదరు కాంట్రాక్టర్ రూ.25 లక్షలు జరిమానాగా చెల్లించాలని, తర్వాతి ఏడాది కూడా ప్రమాదాలు పునరావృతమైతే ఫైన్ రూ.50 లక్షలకు పెరుగుతుందని తెలిపారు. హైవేల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా 3,500 రోడ్డు ప్రమాదాల స్ట్రెచ్‌లను గుర్తించిందన్నారు.

# ఆదివారం సెలవు లేదు!

## ఫిబ్రవరి 1నే కేంద్ర బడ్జెట్..




## తొలిసారి ఆదివారం నాడు బడ్జెట్!!

భారత పార్లమెంటరీ చరిత్రలో తొలిసారి ఒక విశేషం నమోదు కాబోతుంది. ఇప్పటికే 8 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఏకైక ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలిచిన క్రమంలో.. మరో అరుదైన రికార్డ్ కు ఆమె సిద్ధమయ్యారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఆమె 9వ సారి పద్దును ప్రవేశ పెట్టబోతున్నారు. అది కూడా ఆదివారం నాడు ఈ సారి బడ్జెట్ ఉభయ సభల ముందుకు రానుంది. 2026-27ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌ను పార్లమెంటరీ సంప్రదాయాల ప్రకారం ఫిబ్రవరి 1నే ప్రవేశపెట్టబోతున్నారు. 2017 నుంచి ఈ సంప్రదాయం ప్రారంభమైంది. సాధారణ బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీలో పెద్ద మార్పును 2017 లో చేశారు. అంతకు, సాధారణ బడ్జెట్ ఫిబ్రవరి చివరి రోజున ప్రవేశపెట్టేవాళ్లు. దీని ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం నుంచి వచ్చే నిధులను అంచనా వేసి ఆయా రాష్ట్ర బడ్జెట్ ను ప్రవేశ పెట్టడానికి ఆలస్యమవుతుంది కేంద్రం భావించి తేదిని మార్చింది.

కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన మొదటి మూడు నెలల ఖర్చులకు ప్రభుత్వం అనుమతి పొందేది. అయితే, మొత్తం సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌కు తర్వాత ఆమోదం లభించేది. 2017 నుంచి నాటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే సంప్రదాయాన్ని ప్రారంభించారు. దీంతో మార్చి చివరి నాటికి బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం పొందేది.

**ఎలాంటి మార్పు లేదు..** ఈ సారి కూడా పార్లమెంట్ లో బడ్జెట్ ఫిబ్రవరి 1నే ఉభయ సభల ముందుకు రానుంది. బడ్జెట్ సమావేశాలకు సంబంధించి అధికారిక షెడ్యూల్ విడుదలైంది. పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశమై దీనిపై తుది నిర్ణయం తీసుకుంది. జనవరి 31న బడ్జెట్ సమావేశాలు ప్రారంభ కాబోతున్నాయి. అదే రోజు రాష్ట్రపతి ప్రసంగం ఉంటుంది. అనంతరం ఫిబ్రవరి 1న లోక్ సభ, రాజ్యసభల్లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 సంవత్సరానికి సంబంధించి వార్షిక పద్దును ప్రవేశపెడతారు.

**దేశ చరిత్రలో తొలిసారి ఆదివారం..** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఈ సారి తన తొమ్మిదో బడ్జెట్‌ను సమర్పించబోతున్నారు. ఇది దేశ చరిత్రలో ఓ కీలక మైలురాయి. అయితే ఆదివారం సెలవు దినం కావడంతో పాటు ఆ రోజున గురు రవిదాస్ జయంతి కూడా ఉండటంతో తేదీ మార్పుపై ఊహాగానాలు నెలకొన్నాయి. వాటిని ఖండిస్తూ.. అధికారిక ప్రకటన విడుదలైంది. భారత పార్లమెంటరీ చరిత్రలో బడ్జెట్‌ను గతంలో శనివారాల్లో ప్రవేశపెట్టిన సందర్భాలు ఉన్నాయి 2020లో, 2025లో శనివారం పద్దును ప్రవేశపెట్టారు. కానీ ఆదివారం నాడు బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇప్పటి వరకు జరగలేదు. కాగా దేశ చరిత్రలో తొలిసారి ఆదివారం బడ్జెట్ ప్రవేశపెట్టబోతున్నారు నిర్మలమ్మ.




## సోనియా గాంధీకి అస్వస్థత.. ఆస్పత్రిలో అడ్మిట్..

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని.. శ్వాస సంబంధిత సమస్యలతో ఆమె ఇబ్బంది పడుతున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో వాయు కాలుష్యం భారీగా పెరిగిపోయింది. శ్వాస సంబంధిత సమస్యలతో బాధపడేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోనియా గాంధీ కూడా చాలా కాలంగా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతున్నారు. ఢిల్లీలో ఎయిర్ పొల్యూషన్ పెరిగిన ప్రతి సారి ఆమె ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పుడు కూడా ఢిల్లీలో చలి తీవ్రత పెరగడం, పొల్యూషన్ కూడా భారీగా పెరగడంతో సోనియా గాంధీ అస్వస్థతకు గురయ్యారు. సోమవారం సాయంత్రం ఆమె ఆస్పత్రిలో చేరారు. రొటీన్ చెకప్‌లో భాగంగానే సోనియా గాంధీ ఆస్పత్రిలో చేరినట్లు హాస్పిటల్ సిబ్బంది చెబుతున్నారు. ఢిల్లీలో పొల్యూషన్ ఎక్కువగా ఉన్న సమయంలో సోనియాగాంధీ రెగ్యులర్ చెకప్‌ల కోసం క్రమం తప్పకుండా ఆస్పత్రికి వస్తారని అధికారులు తెలిపారు.

## విజయ్ ను లాగేసే పనిలో అమిత్ షా.. తమిళనాట సరికొత్త రాజకీయం

తమిళనాడులో దశాబ్దాలుగా పాతుకుపోయిన ద్రావిడ రాజకీయాలకు సవాల్ విసిరేలా అమిత్ షా తాజా పర్యటన సాగింది. ఒకవైపు అధికార డీఎంకే, మరోవైపు ప్రధాన ప్రతిపక్షం ఏఐఏడీఎంకే మధ్య నలుగుతున్న తమిళ రాజకీయాల్లోకి మూడో ప్రత్యామ్నాయంగా ఎదగాలని బీజేపీ భావిస్తోంది. ఈ క్రమంలోనే నటుడు విజయ్ రాకను బీజేపీ ఒక అవకాశంగా మలుచుకోవాలని చూస్తోంది.

**ద్రావిడ కోటకు బీటలు వేసే 'షా' వ్యూహం...** బీజేపీ అగ్రనేత అమిత్ షా తన పర్యటనలో రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. కేవలం హిందూత్వ కార్డుతోనే కాకుండా.. యువతలో విపరీతమైన క్రేజ్ ఉన్న విజయ్ వంటి నేతలను కలుపుకొని వెళ్లడం ద్వారా ద్రావిడ పార్టీల ఓటు బ్యాంకుకు గండి కొట్టవచ్చని బీజేపీ యోచిస్తోంది. యువత, తటస్థ ఓటర్లను ఆకర్షించేందుకు ఈ ప్లాన్ చేస్తోంది.. ఎన్డీఏ కూటమిని విస్తరించి విజయ్ ను కీలక భాగస్వామిని చూస్తోంది.

**మెల్లగా మెత్తబడుతున్న విజయ్?...** విజయ్ తన రాజకీయ ప్రవేశంలో బీజేపీ, డీఎంకే రెండింటినీ విమర్శించారు. అయితే రాజకీయాల్లో శాశ్వత శత్రుత్వాలు ఉండవన్నది అనుభవజ్ఞుల మాట. అమిత్ షా పర్యటన తర్వాత బీజేపీ అధిష్టానం విజయ్ టీమ్‌తో టచ్‌లోకి వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. విజయ్ మాత్రం తన పార్టీ స్వతంత్రతను కాపాడుకోవాలని భావిస్తున్నారు.

పొత్తు జరిగితే అది కేవలం సీట్ల సర్దుబాటుకే పరిమితమవుతుందా? లేక అధికార భాగస్వామ్యానికి దారితీస్తుందా? అన్నది కీలక ప్రశ్నగా మారింది. బీజేపీతో కలిసి వెళ్తే విజయ్‌కు జాతీయ స్థాయిలో మద్దతు లభించే అవకాశం ఉంది. అయితే తమిళనాడులో బలమైన ద్రావిడ సెంటిమెంట్ కారణంగా మైనారిటీ, సెక్యులర్ ఓట్లపై ప్రభావం పడే ప్రమాదమూ ఉంది. ఈ రెండింటినీ తూకం వేసుకుంటూ విజయ్ ఆచితూచి అడుగులు వేస్తున్నారని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**ముఖ్యమంత్రి అభ్యర్థిగా విజయ్?...** ఢిల్లీ పెద్దలతో విజయ్ భేటీ కాబోతున్నారనే ప్రచారం జోరందుకుంది. ఒకవేళ పొత్తు కుదిరితే విజయ్ ను ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడానికి కూడా బీజేపీ వెనకాడకపోవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తద్వారా అన్నాడీఎంకే ఓటు బ్యాంకును తమ వైపు తిప్పుకోవచ్చని కమలనాథుల లెక్క.



**భవిష్యత్తు ఏంటి?...** ప్రస్తుతానికి విజయ్ ఒంటరిపోరు అని చెబుతున్నా.. అమిత్ షా మార్క్ రాజకీయ చాణక్యం ముందు ఆయన ఎంతకాలం నిలబడుతారనేది ఆసక్తికరం. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి తమిళనాడులో డీఎంకే కూటమి వర్సెస్ ఎన్డీఏ విజయ్ తో కలిపి అన్నట్లుగా పోరు మారే సూచనలు కనిపిస్తున్నాయి. అమిత్ షా వ్యూహాలు, విజయ్ క్రేజ్ కలిస్తే తమిళనాడులో కొత్త చరిత్ర లిఖించబడుతుందా? లేక ద్రావిడ భావజాలం ముందు ఈ కొత్త ప్రయోగాలు విఫలమవుతాయా? అన్నది కాలమే నిర్ణయించాలి.

# దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

## పింఛన్ల పెంపుపై ప్రభుత్వం గుడ్ న్యూస్..



## ఆసరా పింఛన్ల పెంపు!... ముంపుగా వారికే...!

హైదరాబాద్ : దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఎన్నికల హామీలను అమలు చేయడమే లక్ష్యంగా.. ఆసరా పింఛన్ల పెంపుతో పాటు, దివ్యాంగుల కోసం ప్రత్యేక సంక్షమ పథకాలను అమలు చేస్తుంది. ఈ క్రమంలోనే ముఖ్యంగా దివ్యాంగులకు నెలకు రూ.6,000 పింఛన్ అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మేరకు వృద్ధులు, ఇతర వర్గాలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.2,016 పింఛన్‌ను రూ.4,000కు, అలాగే దివ్యాంగులకు ప్రస్తుతం అందుతున్న రూ.4,016 పింఛన్‌ను రూ.6,000కు పెంచే దిశగా ఆర్థిక శాఖతో కలిసి ప్రభుత్వం కసరత్తు చేస్తోందని

**ఆర్థిక శాఖ ప్రణాళిక..** ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, ఇతర వర్గాలకు ఇస్తున్న రూ.2,016 పింఛన్‌ను రూ.4,000కు, దివ్యాంగులకు అందుతున్న రూ.4,016 పింఛన్‌ను రూ.6,000కు పెంచే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తుంది. ఆర్థిక శాఖ ప్రణాళికల మేరకు ముందుగా దివ్యాంగులకు పెంపు అమలు చేసి, ఆ తర్వాత దశలవారీగా మిగిలిన వర్గాలకు వర్తింపజేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. పింఛన్లతో పాటు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే అంశంపైనా ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

**44 లక్షల మంది..** హైదరాబాద్ మలక్‌పేటలోని దివ్యాంగుల సంక్షమ శాఖ కార్యాలయంలో నిర్వహించిన లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దివ్యాంగుల సంక్షమానికి తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 44 లక్షల మంది వివిధ వర్గాల ప్రజలు ఆసరా పింఛన్లను పొందుతున్నారని గుర్తు చేశారు. పింఛన్లతో పాటు దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించే అంశంపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఫోన్‌లో చర్చించామని, త్వరలోనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుళ్లి నిర్ణయం తీసుకుంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు.

**మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం..** విద్యా రంగంలోనూ కీలక మార్పులు రానున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అంధులు, బధిర విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అలాగే ఇప్పటివరకు పదో తరగతి వరకే పరిమితమైన బ్రెయిలీ లిపి పుస్తకాలను ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయి వరకు విస్తరించనున్నారు. దివ్యాంగుల కార్పొరేషన్ ద్వారా దాదాపు 8 వేల మందికి ఉచితంగా సహాయక పరికరాలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. అంతేకాకుండా, దివ్యాంగ జంటల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకంతో పాటు అదనంగా మరో లక్ష రూపాయల ప్రోత్సాహకం అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కొత్తగా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు గ్రామ సభల ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఈ చర్యలు అమలైతే రాష్ట్రంలోని లక్షలాది దివ్యాంగ కుటుంబాలకు ఆర్థికంగా, సామాజికంగా పెద్ద ఊరట లభించనుందని ప్రభుత్వం భావిస్తోంది.

# సంపాదకీయం

## ‘సాఫ్ట్ స్కిల్స్’..

### ఏఐ యుగంలో విజయానికి ఇదే కీలకం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శరవేగంగా అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ఉద్యోగులు, విద్యార్థులు కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ఈ కీలక సమయంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ మాట్ గార్మన్ యువతకు ఒక విలువైన సలహా ఇచ్చారు. భవిష్యత్తులో విజయానికి కేవలం సాంకేతిక (టెక్నికల్) జ్ఞానం మాత్రమే కాక సాఫ్ట్ స్కిల్స్ అత్యంత అవసరం అని నొక్కి చెప్పారు. గార్మన్ అభిప్రాయం ప్రకారం.. ఏఐ టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా.. మానవులకు మాత్రమే సొంతమైన కొన్ని సామర్థ్యాలను యంత్రాలు అనుకరించలేవు. అవేంటంటే.. క్రిటికల్ థింకింగ్.. క్లిష్టమైన సమస్యలను విశ్లేషించడం, లోతైన ఆలోచనతో సరైన నిర్ణయాలు తీసుకోవడం ఏఐతో సాధ్యం కాదు. అడాప్టబిలిటీ అవసరం. మారుతున్న పరిస్థితులకు, కొత్త టెక్నాలజీలకు త్వరగా అలవాటు పడగల సామర్థ్యం అవసరం.. కమ్యూనికేషన్ స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. తమ ఆలోచనలను స్పష్టంగా వ్యక్తపరచడం, ఇతరులతో సమర్థవంతంగా సంభాషించడం ముఖ్యం.. గార్మన్ ఇదే విషయాన్ని చెబుతూ “మానవుల ఆలోచనా సామర్థ్యం, క్రియేటివ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, వివేకంతో కూడిన నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం మాత్రం యంత్రాలు చేయలేవు.” అందుకే యువత ఏ విభాగంలో చదువుతున్నా, స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

**మానవీయ నైపుణ్యాల ప్రాధాన్యత...**

అనేక సంస్థలు తమ కస్టమర్లతో మానవీయంగా మాట్లాడగలిగే.. వారి భావనను పంచుకోగలిగే వ్యక్తులను కోరుకుంటాయి. ఏఐ యుగంలోనూ ఈ మానవీయ నైపుణ్యాలు అత్యంత ప్రాధాన్యం కలిగి ఉంటాయని అమెజాన్ వెబ్ సర్వీసెస్ సీఈఓ స్పష్టం చేశారు.

**జోహో కార్ప్ కూడా అదే సూచన...**

ఈ అభిప్రాయాన్ని జోహో కార్పొరేషన్ ఏఐ రీసెర్చ్ చీఫ్ రాంప్రకాశ్ రామమూర్తి కూడా బలపరిచారు. ఇంటర్నెట్ వచ్చినప్పుడు ఉద్యోగాల రూపురేఖలు మారినట్లే, ఇప్పుడు ఏఐ కారణంగానూ ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ రీసనింగ్, క్రిటికల్ థింకింగ్ వంటి నైపుణ్యాలలో మానవులకే ఎప్పటికీ ఆధిక్యం ఉంటుందని తెలిపారు. మానవ మేధస్సు ఎల్లప్పుడూ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఏఐ సాంకేతికత అగ్రస్థానంలో ఉన్నప్పటికీ.. ఉద్యోగాలను భద్రపరుచుకోవాలంటే టెక్నాలజీ నైపుణ్యాలకు తోడు మానవీయ నైపుణ్యాలు, లోతైన ఆలోచనా శక్తి, సమస్య పరిష్కార దృక్పథం అత్యంత అవసరం. భవిష్యత్తులో విజయవంతం కావాలనుకునే ప్రతి ఒక్కరూ ఈ ‘సాఫ్ట్ స్కిల్స్’పై దృష్టి సారించడం తప్పనిసరి.

## ఓటర్ కార్డుల్లో మార్పు చేర్పులు ఉంటే ఓటర్లు సత్వరం సవరించుకోవాలి...

**బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓటింగ్ ప్రక్రియ...**

**బోగస్ ఓట్లు, డెత్ కేసులను, డబుల్ ఓట్లను తొలగించాలి...**

**జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో ఓటర్ లిస్ట్ పై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి...**








జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని 12 మున్సిపాలిటీలలో తొమ్మిది జిహెచ్ఎంసిలో విలీనంకాగా మిగిలిన 3 మూడుచింతల పల్లి, ఎల్లంపేట్, ఆలియాబాద్ మున్సిపాలిటిలలో ఎన్నికల నిర్వహాణ నిర్ణయం మేరకు ఓటరు లిస్టు పై పొలిటికల్ పార్టీ సభ్యులతో జిల్లా కలెక్టర్ మను చౌదరి సమీక్ష సమావేశం నిర్వహించారు. మంగళవారం కలెక్టరేట్ విసి హాల్ లో అన్ని పొలిటికల్ పార్టీ సభ్యుల తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... త్వరలోనే మున్సిపల్ ఎలక్షన్స్ ఉన్నందున మున్సిపల్ పరిధిలో ఓటర్ల జాబితా సవరణపై శ్రద్ధ వహించాలని ఈ ప్రక్రియలో పార్టీ సభ్యులు తమ వంతు సహకారం అందించాలన్నారు. అందులో భాగంగా ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియలో బోగస్ ఓట్లు, డెత్ కేసులను, డబుల్ ఓట్లను తొలగించాలని అన్నారు. ఈసారి జరిగే ఎన్నికలలో బ్యాలెట్ బాక్సుల ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. వార్డుల రీ ఆర్గనైజెషన్‌లో బూతులు మారిన సూచించారు. వార్డులకు సంబంధించిన కాలనీలలో ప్రజలకు అనుకూలంగా ఉండేలా దగ్గరగా బూతులను ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ బూతులను ఎక్కువగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. అవసరమైన మార్పులు చేర్పులకు సంబంధిత ఫారంలలో నమోదు చేసుకోవాలన్నారు. బూత్ లెవెల్ ఎజెన్సీల వారి ద్వారా బోగస్ ఓట్లను తొలగించాలన్నారు. నిజమైన మార్పులు ఏమైన ఉంటే వెంటనే నమోదు చేసుకోవాలన్నారు. ఓటర్ల నమోదు నిరంతరాయ ప్రక్రియని కొత్తగా నమోదు చేసుకునే వారు ఫారం 6 లో నమాదు చేసుకోవచ్చని తెలిపారు. అనంతరం అన్ని పార్టీల సభ్యులు తెలిపిన సమస్యల పై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో జిల్లా డిఆర్ఓ హరిప్రియ, డిఆర్డిఓ సాంబశివరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ మతిన్, పలు పొలిటికల్ పార్టీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ





శామీర్ పేట, జనవరి 6 (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టగా అలియాబాద్ కు చెందిన ఉయ్యాల లలిత, కుటుంబ సభ్యులు జగదీశ్వర్, సీతారాంలు 26 కేజీల బియ్యం , అలాగే శివయ్య- జయలక్ష్మి దంపతులు 26 కేజీల బియ్యం, పరక శ్రీనివాస్- సంతోషి దంపతులు, శామీర్ పేట కు చెందిన కీ. శే. బత్తిని ఈశ్వర్ గౌడ్ కుటుంబ సభ్యులు, దేశం నరేష్ గౌడ్- మేఘనా దంపతులు, రుద్రాక్ష, వాసగాని గణేష్ గౌడ్- సువర్ణ దంపతులు, యాస్కి వెంకటేష్ గౌడ్- వసంత దంపతులు, శ్రీనివాస్- రజిత దంపతులు అన్నదానానికి సహకరించారు. ఎల్లమ్మ తల్లి ఆలయానికి విచ్చేసే భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

## జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడిగా మండల గంగారెడ్డి ఎన్నిక ...





శామీర్ పేట, జనవరి 6 ( గరుడ వార్త) : మేడ్చల్ జిల్లా దివ్యాంగుల అధ్యక్షుడిగా మండల గంగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం శామీర్పేటలోని మిరియాల కిషన్రావు హాల్ లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ( ఎన్పిఆర్డి ఇండియా ) మేడ్చల్- మల్కజిగిరి దివ్యాంగుల జిల్లా స్థాయి సదస్సు జరిగింది. జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున దివ్యాంగుల ప్రతినిధులు పాల్గోన్నారు. త్వరలో జరగనున్న మున్సిపాల్ ఎన్నికల్లో వికలాంగులకు ప్రాతినిధ్యం కల్పించాలని, దివ్యాంగుల శాఖ మంత్రి అండ్లూరి లక్షణ్ కుమార్ ఇటీవల చెప్పిన విధంగా దివ్యాంగుల పింఛన్ 4 వేల రూపాయల నుంచి 6 వేల రూపాలకు పెంచాలని, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించెవిధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సదస్సు తీర్మాణం చేసింది. అనంతరం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ( ఎన్పిఆర్డి ఇండియా ) నూతన జిల్లా కమిటిని 28 మందితో ఎన్ను కున్నారు. మేడ్చల్ దివ్యాంగుల జిల్లా అధ్యక్షుడిగా శామీర్ పేట మండలం తూంకుంట కు చెందిన మండల గంగారెడ్డిని ఎకగ్రీవంగా ఎన్నికకాగ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా సామిలేటి ధనరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండ చంద్రయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅథిధులుగా హాజరైన సంఘం జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్, జిల్లా ఇంచార్జ్ దామేర రాజేందర్ ల చేతుల మీదుగా నియామక పత్రాలు అందించారు.

**నూతన అధ్యక్షుడు మండల గంగారెడ్డిని అభినందించిన జిల్లా కలెక్టర్ మను చౌదరి....**

ఎన్పిఆర్డి ఇండియా మేడ్చల్ జిల్లా నూతన అధ్యక్షుడి గా ఎన్నికైన మండల గంగారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా సామిలేటి ధనరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొండ చంద్రయ్యలతో పాటు సంఘం ప్రతినిధులు జిల్లా కలెక్టర్ మను చౌదరిని మార్యదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ నూతన కమిటికి శుభాకాంక్షలు తెలయచేసి జిల్లా నూతన అధ్యక్షుడి గా ఎన్నికైన మండల గంగారెడ్డిని శాలువతో సన్మానించి అభినంధనలు తెలయచేశారు. ఈ సందర్భంగా జిల్లాలో దివ్యాంగుల సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారం చేస్తామని కలెక్టర్ హామి ఇచ్చారు.

## మహిళ హత్య కేసులో నింధితుడికి జీవిత ఖైది

### రూ.1000 జరిమానా విధించిన న్యాయస్థానం..

శామీర్ పేట, జనవరి 6 ( గరుడ వార్త) : గుర్తు తెలియని మహిళను హత్య చేసిన నింధితుడికి జీవిత ఖైది శిక్షతో పాటు రూ. 1000 జరిమానా విధిస్తూ జిల్లా అధనపు సెషన్స్ న్యాయ మూర్తి తీర్పును వెలువరించారు . ఈ సంఘటన శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓల్డ్ అల్వాల్, మంగాపురం కాలనీకి చెందిన సద్ది విష్ణువర్దన్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా హెచ్ఎండిఏ ఓఆర్ఆర్ ప్లాంటెషన్ రక్షణ కాంట్రాక్టు పనులు నిర్వహిస్తూ ఓఆర్ఆర్ పరిసరాల్లోని మొక్కల సంరక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ఆయన వద్ద 9 వాటర్ ట్యాంకర్లు, 20 మంది కార్మికులు పని చేస్తుండగా వారానికి ఒకసారి మొక్కలకు నీరు పడుతుంటారు. 2019 మార్చి 16న ట్యాంకర్ డ్రైవర్ యాదగిరి ఓఆర్ఆర్ ప్లాంటెషన్ ప్రాంతంలో ఉప్పర్ పల్లి సర్కిల్ పరిధిలో మొక్కలకు నీరు పడుతుండగా అక్కడ పని చేస్తున్న కార్మికులు సుమారు 30, 35 సంవత్సరాల గల ఓ గుర్తు తెలియని మృతదేహం చిన్న రాళ్ళ మధ్య తీవ్రంగా కుళ్ళిపోయిన స్థితిలో కనిపించడంతో యాదగిరి ఫోన్ ద్వారా విష్ణువర్ధన్ రెడ్డికి తెలియజేశారు. ఈ విషయాని శామీర్ పేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నింధితుడు మగాని రాములుని అదుపులోకి తీసుకుని విచారించగా మహిళను హత్య చేసి మొబైల్ ఫోన్ ను దొంగలించినట్లు ఒప్పుకున్నాడు.

అనంతరం నింధితుడిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించి న్యాయ స్థానం ముందు హాజరు పరిచారు. కేసు వాదొప వాదాలు విన్న న్యాయమూర్తి మంగళవారం అతనికి జీవిత ఖైదితో పాటు రూ. 1000 లను జరిమానా విధిస్తూ శిక్ష విధించారు.

## డ్రైవర్లు తరచు ఆరోగ్య పరీక్షలు తప్పక చేయించుకోవాలి : ఆర్టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డి

శామీర్ పేట, జనవరి 6( గరుడ వార్త ) : డ్రైవర్లు తరచు ఆరోగ్య పరీక్షలు తప్పక చేయించుకోవాలని ఆర్టిఏ సభ్యుడు జైపాల్ రెడ్డి సూచించారు. రోడ్ భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం శామీర్ పేట మండలం హకీంపేట్ ఆర్టీసీ శిక్షణా కేంద్రం లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జైపాల్ రెడ్డి మాట్లాడుతూ రోడ్ భద్రత అనేది కేవలం వాహన నిబంధనలు పాటించడంతోని కాకుండా డ్రైవర్ల శారీరక, మానసిక



ఆరోగ్యంతో ముడిపడి ఉందన్నారు. ముఖ్యంగా బస్సులు నడిపే డ్రైవర్లు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండటం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అతివేగం నివారించి, ట్రాఫిక్ సిగ్నల్స్ తప్పనిసరిగా పాటించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు. కంటి చూపు లోపాలు, రక్తపోటు, షుగర్ వంటి సమస్యలు రోడ్డు ప్రమాదాలకు కారణమవు తున్నాయని తెలిపారు. అందుకే డ్రైవర్లు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆర్టీసీ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ నర్సింహా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో మానవ తప్పిదాలే ప్రధాన కారణమని, అందులో డ్రైవర్ల ఆరోగ్య సమస్యలు ముఖ్యమైన అంశమని తెలిపారు.

రోడ్ భద్రత మాసోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలతో ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని చెప్పారు. భవిష్యత్తులో సైతం ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. డ్రైవర్లు పాల్గొన్నారు.

## స్థల కొరత.. ఆరబోతకు గోస

జగిత్యాల : జగిత్యాల పట్టణంలోని బీట్‌బజార్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో స్థల కొరతతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. 5 వేల క్వింటాళ్ల దినుసులు వస్తే యార్డు పూర్తిగా నిండిపోతోంది. ఏ రోజు వచ్చినవి.. ఆ రోజు కొనుగోలు చేసి, తూకం వేసి తరలిస్తే రైతులు తెచ్చే ఉత్పత్తులు కుప్పలు పోయటానికి స్థలం ఉంటుంది. వివిధ కారణాలతో జాప్యం జరిగితే మరుసటి రోజు ధాన్యం ట్రాక్టర్లు, లారీలు వచ్చే వీలులేకుండా నిండిపోతోంది. దీంతో రైతులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా రూ. 2.80 కోట్ల ఆదాయం ఉన్నా.. పంట ఉత్పత్తుల విక్రయ అవకాశాలు మెరుగుపరచటం లేదు. పాత యార్డులోని మొత్తం 5.20 ఎకరాల స్థలంలో 2 ఎకరాలు సమీకృత మార్కెట్కు ఇవ్వటంతో దినుసుల కల్లానికి స్థలం ఇరుగ్గా మారింది. మార్కెట్ కార్యాలయాన్ని 4 కిలోమీటర్ల దూరంలోని చల్‌గల్ యార్డుకు తరలించటంతో అధికారులు ఓ చోట, క్రయవిక్రయాలు మరోచోట జరుగుతున్నాయి.

**చల్‌గల్‌లో అరకొర వసతులే**

జిల్లా కేంద్రంలోని దినుసుల బీటును చల్‌గల్ యార్డుకు తరలిద్దామంటే.. అక్కడ పూర్తి స్థాయి సదుపాయాల్లేవు. వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి తొలుత తీసుకున్న 21 ఎకరాల్లో 16 ఎకరాల స్థలంలో 15 వేల టన్నుల సామర్థ్యంతో 4 భారీ గోదాములు, రైపెనింగ్ ఛాంబర్, కార్యాలయ భవనం, 2 ధర్మకాంటాలు, 4 వేయింగ్‌షెడ్లు నిర్మించారు. మిగిలిన 5 ఎకరాల భూమితో పాటు వాలంతరి నుంచి మరో 10 ఎకరాలు ఇటీవల తీసుకున్నారు. రూ.కోటితో గచ్చు, రూ. 70 లక్షలతో సిమెంటు రహదారులు, రూ. 5 లక్షలతో వాలంతరి ప్రదర్శన క్షేత్రంవైపు ఫెన్సింగ్, రూ. 10 లక్షలతో గోదాములకు మరమ్మతులు చేపట్టినా పూర్తిస్థాయి సౌకర్యాలు అందుబాటులో లేవు. చల్‌గల్ పట్టణానికి దూరంగా ఉండటంతో దినుసుల రక్షణ సమస్యగా మారింది.

**సౌకర్యాలతో అందుబాటులోకి తేవాలి**

పాత బీటులో స్థలం లేక రైతులు దినుసులు తేవటం లేదు. తెచ్చినవారికి తక్కువ ధరే పలుకుతోంది. చల్‌గల్ బీటులో రైతు విశ్రాంతి భవనం, క్రయవిక్రయాలు, తూకం చేపట్టేలా ఏర్పాటు చేసి తదితరాలు నిర్మించి అందుబాటులోకి తేవాలి. – భూమయ్య, రైతు, తాటిపల్లి

# ఆచరిస్తే.. అభివృద్ధికి అడుగు

కరీంనగర్: 2026 కొత్త సంవత్సరం ప్రారంభం అయింది. జిల్లాలో గతంలో కంటే మెరుగైన అభివృద్ధికి అడుగులు పడాల్సిన అవసరముంది. గత సంవత్సరం(2025)లో ప్రభుత్వాలు ప్రకటించిన పలు పథకాలు, పనులు, ఉపాధి, విద్యారంగ అభివృద్ధికి దోహదపడు తున్నాయి. పాలకులు, అధికార యంత్రాంగం దృష్టిసారిస్తే మరింత మెరుగైన ఫలితాలు లభించనున్నాయి.

**తెలంగాణ బ్రాండ్ కొరమీను**

తెలంగాణలో లభించే బొమ్మె(కొరమీను)ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయి. కరీంనగర్‌లోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో పెంపకానికి సంబంధించి శిక్షణ కేంద్రంతోపాటు ఉత్పత్తి చేపట్టాలని ప్రతిపాదించారు రూ.5.60 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొదటి విడతగా రూ.కోటి మంజూరు చేశారు. తద్వారా మత్స్యకారులకు మరింత ఉపాధి పెరగనుంది.

**శాతవాహన పరిధిలో లా కళాశాల**

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో లా కళాశాల మంజూరైంది. ఎల్ఎల్ఎం, ఎల్ఎల్‌బీ కోర్సులు ప్రవేశపెట్టారు. ప్రస్తుతం ఎల్ఎల్‌బీ కోర్సుకు సంబంధించి సీట్ల కేటాయింపు జరిగింది. దీంతో ఇక్కడి విద్య మరింత మెరుగుపడనుంది.

**ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్**

మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో కరీంనగర్ జిల్లా కేంద్రంగా వాహనాల ఫిట్‌నెస్ పరీక్షించే ఆటోమేటిక్ టెస్టింగ్ కేంద్రం మంజూరైంది. రూ.8.50 కోట్లతో ఏర్పాటు చేసే ఈ కేంద్రం శంకుస్థాపనకే పరిమితమైంది. ఈ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

అమృత్‌తో తీరనున్న తాగునీటి కష్టాలు



కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో గతంలోని విలీన కాలనీలకు తాగునీటి సరఫరా మెరుగుపర్చేందుకు అమృత్ 2.0 కింద రూ.142 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది జూన్ 2026 కల్లా పనులు పూర్తి చేస్తే నీటి కష్టాలు దూరమవుతాయి.

మానేరు రివర్‌ఫ్రంట్

మానేరు రివర్ ఫ్రంట్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. ఇప్పటికే ఆ పనులు కొంతమేర జరగగా మిగతావి చేసేలా పాలకులు స్పందించాలి.

**నిధులు అవసరం**

కరీంనగర్ విస్తీర్ణం? పెరగగా మౌలిక వసతులకు రూ.50 కోట్లు మంజూరుకాగా టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించాల్సి ఉంది. ముఖ్యమంత్రి హామీ నిధులకు సంబంధించిన పెండింగ్ పనులు రెండేళ్లుగా ఆగిపోయాయి. ఈ నిధులు విడుదల చేసి పాత 60 డివిజన్లలో 64 పనులు పూర్తి చేస్తే ఆయా ప్రాంతవాసులకు ఇబ్బందులు దూరం కానున్నాయి.

చెత్త శుద్ధీకరణ సాగాలి నగరంలో డంపింగ్‌యార్డు నిండిపోయింది. బయోమైనింగ్ ద్వారా చేపడుతున్న శుద్ధీకరణను వేగంగా చేపడితే చెత్త నిల్వలు తగ్గే అవకాశముంది. ప్రస్తుతం ఉన్న యంత్రాలతోపాటు మరో రెండు యంత్రాలు ఏర్పాటు చేయడంతోపాటు ఉత్పత్తి ప్రక్రియకు పచ్చజెండా ఊపాలి.

# బండరాతి గుట్ట.. అక్రమ పేలుళ్లకు అడ్డా

పెద్దపల్లి: పెద్దరాళ్లను పగులగొట్టడానికి చిన్నపాటి పేలుళ్లకు అనుమతులు పొందుతూ అక్రమార్కులు ఒకేసారి గుట్టను కూల్చేందుకు బోర్‌బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్నారు. దీంతో సమీప పొలాల్లో రాళ్లు ఎగిరిపడుతున్నాయి. ఎగిసిపడే దుమ్ము దిగుబడులపై ప్రభావం చూపగా రైతులు ఆందోళన చెందుతున్నారు.రాళ్లు కొట్టి ఉపాధి పొందే కూలీల స్థానంలో జిల్లాలో పేలుడు పదార్థాల వినియోగం పెరగడంతో పర్యావరణ హననం జరుగుతోంది. అనుమ తులకు, క్షేత్రస్థాయిలో చర్యలకు పొంతన లేకుండా అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. సమస్యలు వచ్చినప్పుడు మినహా పేలుళ్లపై చూసీచూడనట్లు వ్యవహరించే అధికారుల తీరు తరచూ వివాదాస్పదమవుతోంది.

**కరవైన నియంత్రణ**

క్వారీల్లో పేలుళ్ల నియంత్రణపై పర్యవేక్షణ లేకపోవడంతో జిల్లావ్యాప్తంగా ఈ దందా జోరుగా సాగుతుంది. బొంపల్లిలో పేలుడు పదార్థాల నిల్వ కేంద్రం ఉండగా పాలకుర్తి మండలం కన్నాల, మంథని,



జూలపల్లి, ధర్మారం ప్రాంతాలకు రవాణా జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్య అక్రమ రవాణా సాగుతున్నట్లు సమాచారం. నిబంధనల ప్రకారం బొంపల్లిలోని నిల్వ కేంద్రం బొంపల్లి గుట్టలపై జరిగే పేలుళ్లకే పేలుడు పదార్థాలను సరఫరా చేయాలి. కానీ ఇతర ప్రాంతాల్లో అనుమతుల్లేని క్వారీలకు అక్రమ రవాణా జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

**ధ్వంసం కాగా..** భూమి లోపలి వరకు రాళ్లను తవ్వుకుంటూ వెళ్లడంతో జిల్లాలోని వివిధ క్వారీల్లో లోతైన లోయలు ఏర్పడుతున్నాయి. వీటిలోని బండరాయిని తొలిచేందుకు పేలుడు పదార్థాలు ఎక్కువగా వినియోగించడంతో వీటికి డిమాండ్ పెరిగింది. పేలుళ్ల కారణంగా పెద్దపల్లి మున్సిపాలిటీకి చెందిన పాత నీటిశుద్ధి కేంద్రం ధ్వంసమైంది. ఇక్కడి పోచమ్మ గుట్ట ప్రమాదంలో పడింది. కన్నాలలో జరుగుతున్న పేలుళ్లు, లోయలాంటి గోతులు భారీగా ఉండటంతో బసంత్‌నగర్ సమీపంలో విమానాశ్రయానికి సైతం గతంలో వైమానిక అధికారులు అనుమతులివ్వలేని పరిస్థితి ఏర్పడింది. విచారణ చేపడతాంనిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులొస్తే విచారణ చేపడతాం. కఠిన చర్యలు తీసుకుంటాం.శ్రీనివాస్, జిల్లా మైనింగ్ అధికారి

# బోరుంది..మోటారు ఏమైంది..?



సూర్యాపేట : మోటారు లేకుండా వృథాగా కనిపిస్తున్న ఈ బోరు నూతనకల్ మండలంలోని ఓ గ్రామంలోనిది. మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో నూతనంగా ఎన్నికైన సర్పంచి ప్రజలకు నీటికష్టాలు రావొద్దనే ఆలోచనతో వినియోగంలోని లేని బోర్లను, బావులను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో దాదాపు మూడు విద్యుత్తు మోటార్లు పంచాయతీలో కనిపించకపోవడంతో విస్మయానికి గురయ్యారు. గ్రామపంచాయతీల్లో కొత్తగా బాధ్యతలు చేపట్టిన పాలకవర్గాలు అభివృద్ధి పనులపై దృష్టిసారించాయి. ఈ క్రమంలో అనేక పంచాయతీలకు చెందిన వస్తుసామగ్రి అదృశ్యం అయిన విషయాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా తాగునీటి సరఫరాకు ఉపయోగించే విద్యుత్తు మోటార్లు కనిపించడం లేదనే ప్రచారం జరుగుతోంది.

అదనపు భారం: జనాభా ప్రాతిపదికన ఒక్కో గ్రామంలో నాలుగు నుంచి ఆరు వరకు, పెద్ద ఊర్లైతే దాదాపు 15 మేర బోర్లు, బావులు ఉన్నాయి. వీటిలో రెండు, మూడు వనరుల విద్యుత్తు మోటార్లు అదృశ్యమవడంతో నీటి సరఫరా ప్రధానమని గుర్తించిన సర్పంచులు అదనపు భారమైనా కొత్త మోటార్లు కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలోని మూడు గ్రామాల్లో తాగునీటి బోర్ల మోటార్లు పక్కదారి పట్టినట్లు విమర్శలు వస్తున్నాయి. ఇదొక్క మండలంలోనే కాదు.. ఇంకా బయటపడని గ్రామాలు జిల్లాలో చాలా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా గ్రామపంచాయతీ అధికారులు మాత్రం అందుబాటులోనే ఉన్నాయని చెబుతుండటం గమనార్హం.

ప్రధానంగా తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని పలు మండలాలకు కొద్ది రోజులుగా మిషన్‌భగీరథ నీటి సరఫరా నిలవడంతో సర్పంచులు ఊళ్లలో గతంలో ఉన్నటువంటి నీటి వనరులను వినియోగంలోకి తీసుకొస్తున్నారు. ఈ తరుణంలో కొన్ని పంచాయతీల్లోని రికార్డుల్లో మోటార్లు ఉన్నట్లు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో అవి కనిపించకపోవడంపై అనేక అనుమానాలకు తావిస్తోంది. మరమ్మతుల పేరుతో బయటకు తీసుకెళ్లి తిరిగి అమర్చలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై పంచాయతీ అధికారులు సమగ్ర విచారణ చేస్తే అసలు విషయం బయటికి వస్తుందని జిల్లా ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ఈ విషయంపై జిల్లా పంచాయతీ అధికారి యాదగిరిని వివరణ కోరగా అలాంటి విషయం తమ దృష్టికి రాలేదన్నారు. ఎక్కడైతే మోటార్లు కనిపించడం లేదో అక్కడ విచారణ చేయిస్తామని చెప్పారు

# నేలవాలిన నేత్రం.. నిఘా నామమాత్రం



ఆత్మకూరు : 'ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం..' పోలీసు అధికారులు తరచూ చెప్పే మాట ఇది. అవే కేసుల ఛేదనలో కీలకంగా మారుతాయి. ఆత్మకూరు(ఎం) మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా.. మండల కేంద్రంతో పాటు ప్రధాన గ్రామాల్లో 2018లో దాతల సాయంతో సుమారు 125 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 25 పని చేస్తుండగా, మిగతావి అలంకార ప్రాయంగా మారాయి. పోలీసు శాఖ మరో 104 సీసీ కెమెరాలను నేను సైతం కింద అమర్చగా ఇవి కూడా పనిచేయడం లేదు.

గత ఏడాది మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై ఉన్న కిరాణం, బైక్ మెకానిక్, వైన్స్, రాంనగర్‌లోని కిరాణ దుకాణంలో చోరీలు జరిగాయి. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను పోలీసులు గుర్తించలేక పోయారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతపై 2018 నుంచి పోలీసులు విస్తృతంగా అవగాహన కల్పించారు. వ్యాపారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మండల కేంద్రాలు, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారుల వెంట సుమారు 1600 కెమెరాలు ఏర్పాటు చేశారు. నిర్వహణ, మరమ్మతులు లేక కొద్ది నెలలకే పనిచేయడం లేదు. కోతుల బెడద, ఈదురు గాలులకు చాలాచోట్ల తీగలు తెగిపోయి వెయ్యి కెమెరాలు, దృశ్యాలను నిక్షిప్తం చేసే హెచ్‌డీఆర్‌లు పనిచేయడం లేదు. జిల్లాలో గత కొంతకాలంగా జరిగిన నేరాల్లో నిందితులను గుర్తించేందుకు పోలీసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలోని పరిస్థితిని 'న్యూస్‌టుడే' పరిశీలించింది.

ఆలేరు మండలంలో ఐదేళ్ల క్రితం 16 పంచాయతీల పరిధిలో 155 కెమెరాలు ఏర్పాటు చేశారు. మొదట్లో వీటి పనితీరు బాగానే ఉన్నప్పటికీ.. రెండు సంవత్సరాల నుంచి నిర్వహణ, మరమ్మతులు లేక పనిచేయడం లేదు. టంగుటూరుతో పాటు మరో రెండు గ్రామాలలో మినహా మిగతా గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయడం లేదు.

వలిగొండ, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, రహదారుల్లో దాతల సౌజన్యంతో 125 సీసీ కెమెరాలకు పైగా ఏర్పాటు చేయగా.. సగానికిపైగా పనిచేయడం లేదు.

మోటకొండూరు మండలంలోని చాడ, ఇక్కుర్తి, మాటూరు, తేర్యాల గ్రామాల్లో దాతలు ఏర్పాటు చేసిన కెమెరాలు వృథాగా ఉన్నాయి.

బొమ్మలరామారం, చీకటిమామిడి, రంగాపూర్, రాంలింగంపల్లి, జలాల్‌పురం, మేడిపల్లి, చౌదర్‌పల్లి, హాజీపూర్‌లో దాతల సౌజన్యంతో ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు మూలన పడ్డాయి.

**ఛేదించారు ఇలా..**

2025 డిసెంబరులో భువనగిరి మండలం వడపర్తిలో ఓ రైతుకు చెందిన మంద నుంచి గుర్తుతెలియని వ్యక్తులు కొన్ని గొర్రెలను అపహరించారు. అక్కడి సీసీ కెమెరాల ఆధారంగా దొంగను కనిపెట్టి గొర్రెలను రైతుకు అప్పగించారు. 2025 డిసెంబరులో స్వరగిరిలో చిన్నారి చేతి నుంచి బంగారు గాజును చోరీ చేసిన దుండగుడిని సీసీ కెమెరా ఆధారంగా గుర్తించారు. గాజును బాధితులకు అప్పగించినట్లు గ్రామీణ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

బీబీనగర్‌లో పనిచేయని సీసీ కెమెరాలు

బీబీనగర్ : బీబీనగర్ ప్రధాన మార్గాలు, కూడళ్లలో సీసీ కెమెరాలున్నా పనిచేయడంలేదు. పోచంపల్లి చౌరస్తా, బీబీనగర్ ఎయిమ్స్ వద్ద తరచూ ద్విచక్ర వాహనాల దొంగతనాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఆరు వాహనాలు చోరీకి గురయ్యాయి. ప్రజల విన్నపం ఏమనగా: సీసీ కెమెరాలకు మరమ్మతులు నిర్వహించి..సక్రమంగా నిర్వహణ చేపట్టాలి.

# గందరగోళం.. ఇష్టారాజ్యం


కరీంనగర్ : అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో కనిపించిన తప్పులే నగర పాలక సంస్థ ఎన్నికల ఓటర్ల జాబితాలో కనిపించాయి. ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించారు. శుక్రవారం నుంచి ఆశావహులు, రాజకీయ పార్టీల నాయకులు ఆ జాబితాలను పరిశీలించడం మొదలుపెట్టారు. ఇంటినంబర్లు, పోలింగ్ స్టేషన్ ప్రకారం ఆన్‌లైన్‌లో నమోదు చేయగా నగర ఓటర్లే కాకుండా మంథని, జగిత్యాల, సిద్దిపేట, గంభీరావుపేట, హిమాయత్‌నగర్, జీడిమెట్ల వంటి ప్రాంతాల వారి పేర్లు ఆయా పోలింగ్‌స్టేషన్ల పరిధిలోని జాబితాలో కనిపిస్తున్నాయి.

కొత్త వారు.. అవగాహన లేక

నగరపాలక సంస్థ కార్యాలయంలో డివిజన్ల వారీగా బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు ఉండగా అంతా కొత్తగా నియామకమైన వారున్నారు. డివిజన్ల ఇంటి నంబర్లపై పట్టు లేకుండా పోయింది. పట్టణ ప్రణాళికలోనూ ఇలాగే కొత్త వారు కావడంతో ఇంటినంబర్లతో అనుసంధానం చేయడం ఇబ్బందులకు గురి చేసింది. ఇంటి నంబర్ల ప్రకారం చూడటంతో ఒక డివిజన్‌లోని ఓటర్లు మరో డివిజన్‌లోకి చేర్చారనే విమర్శలు వస్తున్నాయి.

ఒకే పోలింగ్ కేంద్రంలోనే..

సాధారణ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లకు పోలింగ్ కేంద్రాలు దూరంగా వేశారు. ఎక్కువ శాతం ఓటర్లు దూరభారంతో ఓటు వేసేందుకు ఆసక్తి చూపించలేదు. పుర ఎన్నికల్లో మాత్రం ఇంటి నంబర్ల ఆధారంగా సమీపంలో పోలింగ్ కేంద్రం ఉండేలా, దాని పరిధిలోని కుటుంబం మొత్తం ఓటర్లు ఉండేలా జాబితా తయారు చేశారు.



వీరంతా ఎక్కడి నుంచి వచ్చారో..

8వ డివిజన్ అలుగునూర్ ప్రాంతంలోని ఓటర్ల జాబితాలో గాంధీనగర్, కొత్తపల్లి, రేకుర్తి, హిమాయత్‌నగర్, కల్వచర్ల, వీణవంక, తిమ్మాపూర్, అశోక్‌నగర్ ఓటర్లు కనిపిస్తున్నారు.

28వ డివిజన్‌లోని ఇంటినంబర్ల ఓటర్లు కాకుండా ఇతర ప్రాంతాల ఇంటి నంబర్లు జాబితాలో చేరాయి. ఇలా సుమారు 460 ఓటర్ల వివరాలు వేరుగా ఉన్నాయి. 31వ డివిజన్‌లో ఇం.నం.1-1-68 ఓటర్లు చేరారు. వీరంతా పాత డివిజన్ మేదరివాడలో ఉండాల్సింది కొత్త జాబితాలో అలాగే ఉన్నారు.హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పురపాలికల పరిధిలోనూ వార్డుల ఓటరు జాబితా పరిశీలిస్తే కరీంనగర్ ఓటర్లు ఉన్నారు.

డివిజన్లు : 66 మొత్తం ఓటర్లు: 3,40,775 పురుషులు : 1,69,763 మహిళలు : 1,70,969 ఇతరులు : 43

# మమకారం కురిపిస్తే కారాగారమే..!

కొత్తగూడెం : మా అబ్బాయి చిన్నపిల్లోడే కానీ.. ద్విచక్రవాహనం సూపర్‌గా నడుపుతాడు.. మా బాబు అలా.. ఇలా.. అంటూ గొప్పలకు పోయి లేనిపోని మమకారం ఒలకబోసి మైనర్లకు వాహనాలు ఇస్తే ఇకమీదట చెల్లుబాటయ్యే పరిస్థితులు లేవు సుమీ..! వల్లమాలిన ప్రేమతో మైనర్ల చేతికి వాహనాలు అప్పగించి హద్దులు దాటితే పెద్దలు కటకటాలపాలవటం ఖాయం. జిల్లా పోలీసులు ఈ విషయంపై ఈ ఏడాదిలో చట్టాన్ని పటిష‘ంగా అమలుచేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈమేరకు పోలీసు యంత్రాంగానికి ఎస్పీ బి.రోహిత్‌రాజు ఇప్పటికే సూచనలు చేశారు.

మైనర్లకు ఎలాంటి అర్హత లేకపోయినా ద్విచక్రవాహనాలపై విన్యాసాలు చేస్తుంటారు. రోడ్డు ప్రమాదాలు అదేస్థాయిలో విపరీతమవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణ క్రతువులో భాగంగా పోలీసు యంత్రాంగం ఈ దిశగా అడుగులు వేస్తుంది. ఇక మీదట మైనర్లు వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కితే సంబంధిత ఇళ్లల్లో పెద్దవారిపై కేసులు



నమోదుచేయనున్నారు. అవసరమైతే పెద్దల లైసెన్సులను రద్దు చేయటానికి వెనుకాడే పరిస్థితులు లేవని హెచ్చరిస్తున్నారు.

పిల్లలు బాగానే వాహనం నడుపుతారనే ధీమాతో మార్కెట్ లేదా కళాశాలలకు పంపించినా తల్లిదండ్రులు ఇబ్బందులకు గురవ్వాల్సి వస్తుంది. ఇకపై వాహనాలు ఇచ్చేముందు ఒకటికి పదిసార్లు ఆలోచించుకుని అప్రమత్తంగా వ్యవహరించాలని పోలీసులు సూచిస్తున్నారు.

తస్మాత్ జాగ్రత్త ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు నడిపే మైనర్లను నియంత్రించేందుకు 2024 నుంచే క్రతువును పోలీసులు ఆరంభించారు. అందులో భాగంగానే డ్రంకన్‌డ్రైవ్, ఈ-చలానా కేసులను విపరీతంగా పెంచుతూ వచ్చారు. డ్రంకన్ డ్రైవ్ కేసులు 2024తో పోల్చితే 2025లో 24శాతం పైగా పెరిగాయి. 2026 జనవరి ఆరంభం నుంచే మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించనున్నట్లు తెలిసింది.

# ఆధ్యాత్మికత ఉట్టిపడేలా..

భద్రాచలం : భద్రాచలంలో రామాలయ విస్తరణకు సర్వం సిద్ధమైంది. సుమారు మూడున్నర శతాబ్దాల క్రితం రామాలయాన్ని భక్త రామదాసు నిర్మించారు. ఆ తరువాత అనేక మార్పులు, చేర్పులు చోటుచేసుకున్నాయి. నాటి వైభవం చెక్కు చెదరకుండా రెండు ప్రాకారాలతో భక్తుల భవిష్యత్తు అవసరాలు తీర్చేలా విస్తరణ పనులు చేపట్టాలని ఆగమశాస్త్ర పండితులు సూచించారు. బృహత్తర ప్రణాళికకు రూ.350కోట్లకు పైగా అవసరమని ప్రతిపాదించారు. కొద్దిరోజులుగా ఇదే అంశంపై దేవాదాయశాఖ కసరత్తు చేస్తోంది.

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ**

ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి పలుమార్లు భద్రాచలంలో పర్యటించి ఇక్కడి పరిస్థితులను అవగాహన చేసుకుని బృహత్తర ప్రణాళికపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వైదిక పెద్దలు కీలక సూచనలు చేశారు. అయినా ఎక్కడో తేడా వచ్చినట్లు సమాచారం. భక్త రామదాసు అభీష్టం మేరకు ఆలయాలను నిర్మించాలని సూచిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వైదికులు ఇటీవల లేఖ రాశారు. గవర్నర్ జిష?దేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఈఓ దామోదర్‌రావు, దేవాదాయశాఖ ఉన్నతాధికారులకు శ్రీభద్రాచలం సీతారామ అర్చక సంఘం పేరిట వినతిపత్రాలు అందజేశారు.

**వైదిక పెద్దల సూచనలు ఇవిగో..**

భక్త రామదాసు నిర్మించిన విధంగా ఇప్పటి అవసరాల మేరకు రెండు ప్రాకారాలు ఉండాలి. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా వాటికి పేర్లు పెట్టాలి. ఈ ప్రాకారాల్లోని గుడుల గురించి స్పష్టత అవసరం. నిర్మాణాలన్నింటికీ శంఖు చక్రం తిరునామం తప్పనిసరి.

అధ్యయనోత్సవ, నిత్య కల్యాణ, అమావాస్య, పవిత్రోత్సవ, ఉట్ల, అలంకార, ఏకాదశి, ద్వాదశి, పౌర?మి మండపాలు అవసరం. పంచకుండాత్మక యాగశాల, విశాలమైన నివేదన వంటశాల నిర్మించాలి. ఆలయ ప్రాకారాల బయట ఈశాన్య భాగాన పుష్కరిణి ఏర్పాటు చేయాలి. పైవంతెన తరహాలో కొన్ని నిర్మాణాలు చేయాలి. గాలి గోపురానికి ఉత్తర, దక్షిణ దిక్కుల్లో విస్తీర?ం సరిపడా ఉండాలి. శ్రీమహాలక్ష్మి, గోదా, రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయాలు, భక్త రామదాసు సన్నిధిని శాస్త్ర ప్రకారం నిర్మించాలి. బంగారం, వెండి రథశాలలు, మ్యూజియం, స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేయాలి. వీటన్నింటినీ గమనిస్తే.. 'వైదిక పెద్దలతో ఆర్కిటెక్ట్ సమావేశమై సలహాలు తీసుకోవాలి. ఆ తరువాతే బృహత్తర ప్రణాళికకు తుది రూపు ఇవ్వాలి. దీనిపై దేవాదాయశాఖ చొరవ చూపాలి' అని అవగతమవుతోంది.

# బోనకల్లు.. సౌర వెలుగుల జల్లు..!

మధిర : ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలో గృహజ్యోతి లబ్ధిదారుకు ఉచితంగా సౌరవిద్యుత్ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోంది. రాష్ట్రంలోనే మోడల్ సోలార్ విద్యుత్ మండలంగా బోనకల్లుని ఎంపిక చేశారు. మండలంలో గృహజ్యోతి పథకం కింద లబ్ధిపొందే అన్ని గృహాలకు సోలార్ ప్యానల్స్‌ను ఉచితంగా అమరుస్తున్నారు. శుక్రవారం బోనకల్లులో ఈ కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి సమక్షంలో ప్రారంభిం చారు. ప్రధానమంత్రి సూర్యఘర్ విద్యుత్ పథకానికి రాష్ట్రప్రభుత్వం తన వంతు నిధులు జోడించి దీనిని అమలు చేస్తోంది.ఒక్కో లబ్ధిదారుని ఇంటికి రూ.1.40 లక్షల విలువైన నాలుగు ప్యానల్స్‌ని అమర్చుతున్నారు. ఇవి నెలకు 240 యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయనున్నాయి. ఈ విద్యుత్‌ని పొదుపుగా వాడుకుంటే లబ్ధిదారులకు రాష్ట్రప్రభుత్వం గృహజ్యోతిలో ఉచితంగా ఇచ్చే 200 యూనిట్లు పోను మిగిలిన 40కి డిస్కం నుంచి తిరిగి డబ్బులు వచ్చే అవకాశం ఉంది. పూర్తి ఉచితంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం ఏర్పాటు చేయడంతో లబ్ధిదారుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఈ నెలాఖరు లోపు అన్ని ఇళ్లకు..ఇప్పటికే గృహజ్యోతి పథకం పొందుతున్న లబ్ధిదారులకు సౌరవిద్యుత్ వరం లాంటిదని విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి పేర్కొన్నారు. బోనకల్లులో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోనే మొట్టమొదటిగా బోనకల్లు మండలం మొత్తం లబ్ధిదారులకు పూర్తి ఉచితంగా సోలార్ ప్యానల్స్ అమర్చడం జరుగుతోందన్నారు. మండల కేంద్రంలో 960 మంది లబ్ధిదారులను గుర్తించామని, 500 గృహాలకు ఇప్పటికే యూనిట్ పరికరాలను చేర్చామన్నారు. మండలంలోని కొన్ని గ్రామాలకూ పరికరాలను చేర్చినట్లు ఆయన వివరించారు. సోలార్ యూనిట్లను ఉచితంగా లబ్ధిదారుల ఇళ్లకు ఈ నెలాఖరుకు పూర్తిగా అమర్చుతారని వివరించారు. మిగిలిన నియోజకవర్గాల్లో ఒక్కో గ్రామాన్నే ఈ పథకం కింద ఎంపిక చేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ, ఏడీఏలు, ఏఈలు పాల్గొన్నారు.

## రోడ్ల మరమ్మతులకు గ్రహణం

తాండూరు: అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లను బాగు చేయడానికి ఏడాదిన్నర కిందటే రూ.15.20 కోట్లు మంజూరయ్యాయి. పనులు మాత్రం ఇప్పటికీ పూర్తి కాలేదు. కంకర, తారు తొలగి అడ్డదిడ్డంగా మారాయి. వర్షాకాలంలో సవ్యంగా వెళ్లే పరిస్థితి లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం పనులు చేయడానికి వాతావరణం అనుకూలంగా ఉన్నా.. వెరూ పట్టించుకోవడం లేదు.

**నిధుల మంజూరు ఇలా..**

తాండూరు మండలం జిన్‌గుర్తి- సంకిరెడ్డిపల్లికి రూ.కోటి, ధారూర్ వాగు సరిహద్దు నుంచి సంకిరెడ్డిపల్లి వరకు రూ.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి బిజ్వార్‌కు రూ.61 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి గోనూరుకు రూ.71 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డునుంచి రాంపూరుకు రూ.41 లక్షలు, పెద్దేముల్ నుంచి పెద్దేముల్ తండాకు రూ.80 లక్షలు, హన్మాపూరు ఎక్స్ రోడ్డు నుంచి జయరాంతండా సరిహద్దుకు రూ.2 కోట్లు, గిర్మాపూరు ఎక్స్ రోడ్డు నుంచి చింతామణిపట్నం, గిర్మాపూరు తండాకు రూ.83.50 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి ఖానాపూరుకు రూ.67లక్షలు, యాలాల మండలం పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కమాల్‌పూరు, విశ్వనాథ్‌పూరు వరకు రూ.1.75 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి తిమ్మాయిపల్లికి రూ.32 లక్షలు, పీడబ్ల్యూడీ దారి నుంచి కమాల్‌పూరుకు రూ.21 లక్షలు, పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి నాగసమందర్‌కు రూ.71 లక్షలు, కోట్‌పల్లి మండలం అప్రోచ్ రోడ్డు నుంచి ఇందోల్‌కు రూ.35 లక్షలు, బషీరాబాద్ మండలం బషీరాబాద్ నుంచి కొత్లాపూరు, దామర్‌చేడ్‌కు రూ.3.25 కోట్లు, మైల్వార్ నుంచి



కంసాన్‌పల్లి(బి) వరకు రూ.50లక్షలు, పీడబ్ల్యూడీ నుంచి మంథన్‌గౌడ్‌కు రూ.58 లక్షలు మంజూరయ్యాయి.

**17 రోడ్లు.. 34.57 కి.మీ. పొడవు..**

అన్ని మండలాల్లో 17 రోడ్లను బాగు చేస్తే 34.57 కి.మీ. దూరం బాగుపడతాయి. తాండూరు మండలంలో 5, యాలాల మండలంలో 4, బషీరాబాద్ మండలంలో 3, పెద్దేముల్ మండలంలో 4, కోట్‌పల్లి మండలంలో ఒక రోడ్డును బాగు చేయాల్సి ఉంది.

ఉన్నతాధికారులే నిరయం తీసుకోవాలి..

రహదారుల మరమ్మతులు చేపట్టడానికి గుత్తేదారులు ముందుకు రాకపోవడంతోనే పనులు కావడం లేదు. ఇప్పటికే ఏడు సార్లు టెండర్లు పిలిచాం. ఒక్కరూ రాలేదు. మరమ్మతుల విషయంలో ఉన్నతాధికారులు తగిన నిర?యం తీసుకోవాల్సి ఉంది.సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఈఈ

## ఊరిబాగుకు 'ఉపాధి'

పెద్దపల్లి : కోటి ఆశలతో పంచాయతీల్లో పాలకవర్గాలు పగ్గాలు చేపట్టగా గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ఉవ్విళ్లూరుతున్న సర్పంచులకు కొన్ని సవాళ్లు ఎదురుకానున్నాయి. పంచాయతీల్లో నిధుల సమస్య వెంటాడుతుండగా ప్రతీ చిన్న పనికి దిక్కులు చూసే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పల్లెల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం బాసటగా నిలవనుంది. ప్రస్తుతం ఈ పథకాన్ని మార్చిన కేంద్రం వికసిత్ భారత్ – గ్యారంటీ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (వీబీ–జీ రాం జీ)గా చట్టం చేసినా ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న విషయమై స్పష్టత లేదు.

**కొత్త చట్టం ప్రభావం**

వీబీ జీ రాం జీ చట్టం పనులపై కొంత ప్రభావం చూపనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటి వరకు కూలీలకు కేంద్రం 90 శాతం, రాష్ట్రం 10 శాతం నిధులు కేటాయించేది. సామగ్రి వాటాలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం మంజూరు చేసేది. కొత్త చట్టంలో కూలీలకు కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంది. తాజా విధానంలో కూలీలకు కొంత ఇబ్బంది లేకున్నప్పటికీ సామగ్రి వాటాలో చేసే పక్కా భవనాలు, సిమెంట్ రోడ్ల నిర్మాణానికి ఆటంకం కలగనుంది. కొత్త చట్టం అమలుపై మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

**భూగర్భజలాలకు భరోసా**

గుట్టలు, అటవీ ప్రాంతాల్లో కాంటూరు, సమతల కందకాలు నిర్మిస్తే భూగర్భజలాలు పెరగనున్నాయి. ఆయకట్టు పెంపునకు చెరువులు, కాలువల పూడికతీత, పునరుద్ధరణ పనులు, చెక్‌డ్యాంలు, ఊట కుంటలు నిర్మించుకోవచ్చు.

**266 పనులకు అవకాశం**

గ్రామాల అభివృద్ధి ఎక్కువగా ఉపాధి హామీపై ఆధారపడనుంది. దీని ద్వారా 266 రకాల పనులు చేసుకోవచ్చు.సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కూలీల, పని నిష్పత్తి ఆధారంగా నిధులు కేటాయిస్తున్నారు.



పంట భూములకు ఎరువులు, విత్తనాలు తీసుకెళ్లేందుకు దారులు నిర్మించుకోవచ్చు.

జనావాసాల్లోని వృథా నీరు రోడ్లపై చేరకుండా మురుగు కాలువల నిర్మాణానికి అవకాశం ఉంది.

పంచాయతీలకు సొంత గూడు, పాఠశాలలు, అంగన్‌వాడీ భవనాలు నిర్మించుకునే వీలుంది.వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు నిర్మించుకునేందుకు నిధులు రానున్నాయి.

వన మహోత్సవంలో మొక్కల పెంపకం, బంజరు, బీడు భూముల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టవచ్చు.

ఉమ్మడి జిల్లా వివరాలు

సొంత భవనాలు లేని పంచాయతీలు : 584

గూడు లేని అంగన్‌వాడీ కేంద్రాలు : 973

పునరుద్ధరణకు నోచుకోని చెరువులు : 2,758

నిర్మించాల్సిన సిమెంట్ రోడ్లు, మురుగు కాలువలు : 847 కి.మీ.ల పొడవు

## కోకాపేటలో ఇల్లు కట్టేద్దాం..!




హైదరాబాద్ : కోకాపేటలో ఇల్లు కట్టుకుంటే దర్జాగా ఉండొచ్చన్న అంచనాతో కొందరు ప్రభుత్వ భూములపై కన్నేశారు.సర్కారు స్థలాల్లో గుడిసెలు, చిన్న ఇళ్లు కట్టుకుని క్రమబద్ధీకరించుకున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. వారి పట్టాలను తీసుకుని నకిలీ పట్టాలు సృష్టించి ఇళ్లు కట్టుకుంటున్నారు. 80, వంద గజాల్లో అంతస్తులు నిర్మిస్తున్నారు. అధికారులకు అనుమానం వచ్చి పరిశీలించగా... కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి కట్టుకుంటున్నారని తేలింది. కోకాపేటతో పాటు మణికొండలోనూ ఓ వ్యక్తి 60గజాల స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టాడు.

**దర్జాగా ఆక్రమణలు:** కోకాపేట, పుప్పాలగూడ, మణికొండ ప్రాంతాల్లో ప్రభుత్వ భూములున్న కొన్ని ప్రాంతాల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. రెవెన్యూ అధికారులు వీటిపై దృష్టిసారించడంతో రియల్ వెంచర్ల ప్రతినిధులు, పేదలకు ప్రభుత్వం క్రమబద్ధీకరించిన భూములను ఆక్రమించుకోవడం ప్రారంభించారు. తాజాగా కోకాపేటలో నలుగురు వ్యక్తులు సర్వేనంబరు 147లోని 80 గజాల చొప్పున కొన్ని ప్లాట్లకు మార్కింగ్ వేసి ఇళ్లు కట్టుకుంటున్నారు. అధికారులు పట్టాలను పరిశీలించగా... రంగారెడ్డి కలెక్టర్‌గా విధులు నిర్వహించిన హరీష్ సంతకంతో జారీచేసిన పట్టాగా ఉంది. ఫోరెన్సిక్ పరీక్ష చేయించగా... హరీష్ సంతకం కాదని తేలింది.

**సమగ్ర సర్వే నిర్వహిస్తాం** గండిపేట్ మండలంలోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారన్న సమాచారం ఉంది. 60గజాలు, 80 గజాల చొప్పున నాలుగైదు ప్లాట్లను ఆక్రమించి బహుళ అంతస్తుల భవనాలను నిర్మించాలన్నదే వారి ప్రణాళిక. భూములన్నింటినీ పరిశీలించి సమగ్రసర్వే నిర్వహించనున్నాం.ఎన్.శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్

## ఒక్క క్లిక్.. వివాదాలకు చెక్



హైదరాబాద్ : ప్రభుత్వ ఆధీనంలో ఉన్న పట్టణ భూగరిష్' పరిమితి భూములను రక్షించేందుకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నారు. పట్టణ భూ గరిష్' పరిమితి చట్టం(అర్బన్ ల్యాండ్ సీలింగ్) పరిధిలోని సర్కారు భూముల వివరాలను 'ఈ–కోర్టు–యూఎల్‌సీ ఆర్‌ఆర్' పోర్టల్‌లో నమోదు చేశారు. తాము యూఎల్‌సీ పరిధిలోకి రామని, తమ భూములు ఇప్పించాలంటూ కొందరు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఇవన్నీ తప్పేనంటూ రుజువు చేసేందుకు ఈ–కోర్టు పోర్టల్‌లోని ఆధారాలను ట్రైబ్యునల్ కోర్టులు, హైకోర్టులకు రెవెన్యూ అధికారులు సమర్పించనున్నారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శంషాబాద్, మొయినాబాద్, చేవెళ్ల, మహేశ్వరం ప్రాంతాల్లో పట్టణ భూ గరిష్' పరిమితి చట్టంలో భాగంగా తొమ్మిదివేల ఎకరాలకుపైగా ఇప్పటికీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ఎకరా రూ.25కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ పలుకుతోంది. కొందరు ప్రైవేటు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. ఓ రియల్ వెంచర్ సంస్థ ప్రతినిధులు తాము యూఎల్‌సీ పరిధిలోకి రాని భూములను కొనుగోలు చేశామని, నాలా కన్వర్షన్ చేయాలంటూ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా... రెవెన్యూ అధికారులు వారు సమర్పించిన ఆధారాలు సరైనవికావంటూ నిరూపించారు.

**ముందు జాగ్రత్తలు.. డిజిటల్ వివరాలు**

పట్టణ భూ గరిష్' పరిమితి చట్టం ప్రకారం ప్రభుత్వానికి వచ్చిన భూముల సమగ్ర వివరాలను జియోట్యాగింగ్ ద్వారా డిజిటల్ రికార్డులుగా మార్చారు. యూఎల్‌సీ భూములున్న సర్వేనంబర్లలో స్థలాలు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయా.. ఎవరైనా కోర్టుల్లో ఫిర్యాదులు చేశారా.. వివరాలు ఇందులో పొందుపరిచారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నుంచి కలెక్టర్ వరకూ ఒక్క క్లిక్‌తో వివరాలన్నీ తెలుసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.ప్రజల అవసరాల దృష్ట్యా రక్షణ

రంగారెడ్డి జిల్లాలో భవిష్యత్తు అవసరాలను పరిగణనలోకి తీసుకుని పట్టణ భూ గరిష్' పరిమితి చట్టం భూములను కాపాడుకుంటున్నాం. న్యాయస్థానాల్లోని ఫిర్యాదులు, విచారణల సందర్భంగా రికార్డులను సులభంగా చూసుకునేందుకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి. ప్రస్తుతం 900 ఎకరాల భూములపై వివాదాలు కొనసాగుతున్నాయి. పరిష్కరించేందుకు న్యాయస్థానాలకు త్వరలో ఆధారాలను సమర్పించనున్నాం.సి.నారాయణరెడ్డి, కలెక్టర్,రంగారెడ్డి

## అతివలకు ఆదాయ సృష్టి



బొంరాస్‌పేట : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. మహిళా సాధికారత, ఆదాయం పెంపు, పాడి అభివృద్ధే లక్ష్యంగా ఇందిరా డెయిరీ ప్రాజెక్టును చేపట్టాలని నిర?యించింది. ఈ పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రెండు గేదెలు లేదంటే ఆవులు పంపిణీ చేయనుంది. ఈ పథకంతో అతివలకు జీవనోపాధి లభించడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి అవకాశం కలుగుతుంది.

**పెరగనున్న పశుసంతతి, పాల ఉత్పత్తి**

గ్రామాల్లో పశువుల సంఖ్య బాగా తగ్గిపోయింది. వ్యవసాయ పనులు యంత్రాలతో చేయడం, గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు తగ్గి మేతకు కొరత ఏర్పడడంతో పశువులను పెంచుకోవడం తగ్గించారు. దీంతో వాటి సంతతి తగ్గడంతోపాటు పాల ఉత్పత్తి బాగా పడిపోయింది. ప్రభుత్వం అమలు చేసే డెయిరీ ప్రాజెక్టుతో గ్రామాల్లో 31,324 గేదెలు లేదా ఆవుల సంతతి జిల్లాలో అదనంగా పెరుగుతుంది.

**రూ.2 లక్షలతో గేదెలు లేదా ఆవులు..**

ప్రతి మండలాన్ని మూడు జోన్లుగా విభజిస్తారు. పది గ్రామాలను యూనిట్‌గా ఏర్పాటు చేస్తారు. పథకంలో ఒక్కో యూనిట్ ధర రూ.2 లక్షలు. ఇందులో ప్రభుత్వం రూ.1.40 లక్షలు రాయితీ ఇస్తుంది. మిగిలిన రూ.60వేలు బ్యాంకులు రుణంగా అందిస్తాయి. ఈ డబ్బుతో రెండు గేదెలు లేదంటే రెండు ఆవులు కొనిస్తారు. పశువులకు గడ్డి, దాణా సరఫరాను స్థానిక యువతకు అప్పగించి వారికి ఉపాధి కల్పించనున్నారు.

**కొడంగల్‌లో మైనార్టీల కోసం..**

సీఎం నియోజకవర్గం కొడంగల్‌ను ఇందిరా డెయిరీ షీప్ ఫార్మింగ్ పథకానికి పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. దీంతో నాలుగు మండలాల్లో 315 మంది మైనార్టీలకు గేదెలు, మేకలు ఇవ్వాలని ప్రభుత్వం నిర?యించింది. వీరికి రూ.2లక్షల యూనిట్ ధరలో రూ.1.60 లక్షలు రాయితీ, రూ.40వేలు బ్యాంకు రుణం ఇస్తుంది. ఇప్పటికే 20 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. మిగిలిని వారినీ ఎంపిక చేస్తామన్నారు.

గ్రామపంచాయతీలు: 594

మొత్తం స్వయం సహాయక సంఘాలు: 15,662

గ్రామైక్య సంఘాలు: 657

మండల మహిళా సమాఖ్యలు: 19

సంఘాల్లోని సభ్యులు: 1,63,703

## చెరువులకు సం'క్రాంతులు'

హైదరాబాద్ : నగరంలో ఆక్రమణలకు గురైన చెరువులకు హైడ్రా పునరుజ్జీవం పోస్తోంది. తటాకాలు కొత్త రూపు సంతరించుకున్నాయి. మొదటిదశలో భాగంగా ఆరు కాసారాల్లో సుందరీకరణ చేపట్టారు. ఇప్పటికే బతుకమ్మకుంట పనులు పూర్తయ్యాయి. సంక్రాంతికి పాతబస్తీలోని బమ్ రుఖ్ నుద్దౌలా చెరువు, మాదాపూర్‌లోని తమ్మిడికుంట, కూకట్‌పల్లి నల్లచెరువుల్లో చేపట్టిన ప్రగతి పనులు పూర్తి కానున్నాయి. వాటి వద్ద ఈ నెల 11 నుంచి మూడ్రోజులపాటు పతంగుల పండగ నిర్వహించేందుకు హైడ్రా ఏర్పాట్లు ప్రారంభించింది.

**ఆక్రమణల నుంచి ఆహ్లాదకరంగా..**

పాత జీహెచ్‌ఎంసీ పరిధిలో 185 చెరువులుండగా.. 95 శాతం



ఆక్రమణకు గురైనవే. పలు తటాకాలకు హైడ్రా విముక్తి కల్పించింది. 14 ఎకరాలకు కుంచించుకుపోయిన తమ్మిడికుంట చెరువు.. ఇప్పుడు 30 ఎకరాల్లో సుందరంగా ముస్తాబవుతోంది. మురుగు కలవకుండా పైపులైన్లు వేశారు. చెరువులోకి వరద సాఫీగా వచ్చేందుకు కాలువలు నిర్మించారు.కూకట్‌పల్లిలోని నల్ల చెరువు విస్తీర?ం 16 ఎకరాలకు పడిపోయింది. ఆక్రమణలను తొలగించి విస్తీరా?న్ని 30 ఎకరాలకు పెంచారు.పాతబస్తీలోని బమ్ రుఖ్ నుద్దౌలా చెరువు 4 ఎకరాల విస్తీరా?నికి పడిపోవడంతో.. దురాక్రమణలను నేలమట్టం చేసి, 17 ఎకరాల్లో పునరుజ్జీవం కల్పించారు.మాదాపూర్‌లోని సున్నం చెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువుల వద్ద అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని హైడ్రా అధికారులు తెలిపారు.

## 3 ప్రాంతాలు

హైదరాబాద్ నగరంలో విలువైన భూములను వేలం వేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) సిద్ధమవుతోంది. ఈ నెలలోనే నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బంజారాహిల్స్‌లోని హెచ్‌ఎండీఏకు ఉన్న 8.3 ఎకరాలతోపాటు కొండాపూర్‌లో 20 ఎకరాలను బహిరంగ వేలంలో విక్రయించాలని యోచిస్తోంది. ఇప్పటికే బంజారాహిల్స్‌లోని ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో ప్లాట్లుగా విభజించారు.

**కోకాపేటలో 70 ఎకరాలు**

కోకాపేట సర్వీసు రోడ్డు టోల్ బూత్ పక్కనే హెచ్‌ఎండీఏకు 70



ఎకరాలు ఉంది. ఇప్పటికే వాటిలో మౌలిక వసతులను కల్పించింది. అయితే గతంలో ఈ భూమిని ఎస్‌ఈజడ్ కోసం కొన్ని కంపెనీలకు లీజుకు కేటాయించారు. సంస్థలను ఏర్పాటు చేసేందుకు ఏ కంపెనీ ముందుకు రాలేదు. లీజు గడువు కూడా ముగిసింది. దీంతో ఐటీ ఎస్‌ఈజడ్ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకునేందుకు హెచ్‌ఎండీఏ ఆయా సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. దాదాపు అన్ని కంపెనీలు సానుకూలంగా స్పందించాయని ఉన్నతాధికారి తెలిపారు.

## విద్యార్థి పథం.. సమాజ హితం

నల్గొండ : విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో భాగస్వాములవుతున్నారు. జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొక్కలు నాటడం, మూఢనమ్మకాల నిర్మూలన, ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలో పలుచోట్ల ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు కొనసాగుతున్నాయి. ఎంజీయూ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ఈ విద్యా సంవత్సరం జనవరి మొదటి తేదీ వరకు 43 శిబిరాలు నిర్వహించారు. ఈ సంఖ్య మార్చి నాటికి 120 వరకు చేరనుంది.

**ఉమ్మడి జిల్లాలో 163 విభాగాలు..**

ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రస్తుతం 163 ఎన్‌ఎస్‌ఎస్ విభాగాలు ఉన్నాయి. మొత్తం 16,300 మంది వాలంటీర్లు ఉన్నారు. ఒక్కో విభాగంలో 100 మంది విద్యార్థుల చొప్పున ఉన్నారు. ప్రతిఏటా గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే శిబిరం నిర్వహణకు ఒక్కో విభాగానికి కేంద్ర ప్రభుత్వం రూ.35,000 మంజూరు చేస్తుంది.



**విస్తృతంగా కార్యక్రమాలు**డా.మారం వెంకటరమణారెడ్డి, ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో విస్తృతంగా ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలు నిర్వహిస్తున్నాం. ఎప్పటికప్పుడు శిబిరాలను సందర్శించి వాలంటీర్లు చేసే సేవా కార్యక్రమాలను పరిశీలిస్తున్నాం. మార్చి నాటికి 163 ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల్లో 120కి పైగా శిబిరాలు నిర్వహించేలా కృషి చేస్తాం.వాలంటీర్లకు ఉన్నత విద్య, పలు ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం ఉంటుంది. రానున్న రోజుల్లో ఎంజీయూ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌కు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా కృషి చేస్తాం.

**నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయి**

గీత, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్ కాకతీయ డిగ్రీ కళాశాల

నాకు చిన్నప్పటి నుంచి సమాజ సేవ అంటే ఎంతో ఇష్టం. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే శిబిరంలో పాల్గొన్నా. శ్రమదానం, మొక్కలు నాటడం, బాల్యవివాహాలు, మూఢనమ్మకాల నిర్మూలన, అంటువ్యాధులు, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాం. శిబిరంలో పాల్గొనడం ద్వారా కలిసి పనిచేసేతత్వం ఏర్పడింది. క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందాయి.

# కామర్స్‌కే మొగ్గు..

కరీంనగర్ : ఇంటర్ పూర్తయిన తరువాత చాలా మంది విద్యార్థులు డిగ్రీలో ఉపాధి లభించే కోర్సులను ఎంపిక చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. విపణిలో త్వరగా ఉపాధి లభిస్తుందని కామర్స్ కోర్సు తీసుకుంటున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గల డిగ్రీ కళాశాలల్లో గత మూడేళ్లలో బీకాం కోర్సులో చేరిన విద్యార్థుల సంఖ్యే అధికంగా ఉంది. దీన్ని బట్టి ఈ కోర్సు ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

**ఏ గ్రూపు వారైనా చేరవచ్చు**

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్, ఫైనాన్స్, బిజినెస్ అకౌంటెన్సీ, రిటెయిల్ ఆపరేషన్స్ కోర్సులున్నాయి. ఇవి పూర్తి చేసినవారికి విపణిలో.. ముఖ్యంగా వ్యాపార రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. విద్యుత్తు శాఖలో జేఏఓగా ఈ కోర్సు చదివిన విద్యార్థులే 60 శాతం మంది ఉద్యోగాలు సాధిస్తున్నారు. అలాగే కార్పొరేట్ సంస్థల్లో, టాక్స్ కన్సల్టెంట్ వద్ద అకౌంటెంట్‌గా



చేరిపోవచ్చు. ఎంకాం పూర్తి చేసిన విద్యార్థులు బోధన రంగం వైపు వెళ్లవచ్చు. ఎంబీఏ చేస్తే మరింత మెరుగైన ఉద్యోగావకాశాలను పొందడానికి అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపుల్లో ఏది పూర్తి చేసిన వారైనా డిగ్రీలో బీకాంలో చేరడానికి అవకాశం ఉంటుంది. ఈ కారణాలతోనే మెజార్టీ విద్యార్థులు ఈ కోర్సులో చేరుతున్నారు.

**అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తా..**

మాది మల్కాపూర్. అమ్మ వ్యవసాయ పనులు చేస్తుంటుంది. నాన్న గతంలోనే మరణించారు. బీకాం పూర్తి కాగానే ఏదైనా సంస్థలో అకౌంటెంట్‌గా చేరి అమ్మకు సాయపడవచ్చని ఈ కోర్సులో చేరా. చాలా మంది నా తోటి విద్యార్థులు కూడా ఇలాగే కోర్సులో చేరినట్టు చెబుతుంటారు. ప్రస్తుతం కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మరో రెండేళ్లు కష్టపడి ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా నిలబడతా.

చాట్ల సమత, బీకాం, ఎస్సారార్ డిగ్రీ కళాశాల

**దోస్త్ ప్రవేశాల్లో ప్రథమ స్థానం**

బీకాం కోర్సు వైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. దోస్త్ ప్రవేశాలను పరిశీలిస్తే ప్రథమ స్థానం బీకాం కోర్సుకే దక్కుతుంది. ప్రస్తుతం ప్రతి కార్పొరేట్ సంస్థలో తప్పనిసరిగా అకౌంటెంట్ అవసరం ఉంటుంది. దీంతో బీకాం చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోర్సు పూర్తవగానే చాలా మంది ఉద్యోగాల్లో చేరిపోతుంటారు. టి.రాజయ్య, బీకాం, హెచ్‌ఓడీ, ఎస్సారార్ కళాశాల

# చెత్తంతా చెరువుల్లోకి.. విషమంతా తనువుల్లోకి..!

నల్గొండ: సాగు, తాగు అవసరాలకు ఉపయోగపడే చెరువులు వ్యర్థాలతో చెత్తకుండీలుగా మారాయి. ఉమ్మడి నల్గొండ జిల్లా వ్యాప్తంగా 3,500 వరకు పెద్ద చెరువులున్నాయి. 60 శాతం మేర సమీప పరిశ్రమల నుంచి వ్యర్థాలతో కలుషితమవుతున్నాయని జల సంరక్షణ నివేదికల సర్వేలు వెల్లడిస్తున్నాయి. చెరువుల్లో కలుషితాల వ్యాప్తికి కారణమవుతున్న వారిపై కఠిన చర్యలు చేపడితేనే వ్యర్థాలతో కలిగే అనర్థాలు నియంత్రణలోకి వస్తాయని నీటి సంరక్షకులు అభిప్రాయ పడుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో ఇలా..**

నాంపల్లి మండలం నాగుల చెరువులో సమీప ప్రాంతాల చికెన్, మటన్ సెంటర్ నిర్వాహకులు పెద్దఎత్తున డ్రమ్ముల్లో తీసుకువచ్చి పారవేసి వెళ్తున్నారు. వ్యర్థాల మూలంగా ఈ ప్రాంతంలోకి వెళ్తే భరించలేని దుర్వాసన వస్తోంది.నల్గొండ జిల్లా కేంద్రంలోని వల్లభరావు చెరువులో అండర్‌డ్రైనేజీ నీరు కలుస్తుందని పలుమార్లు స్థానికులు పురపాలిక అధికారులకు విన్నవించినా.. ఫలితం లేదు.

సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఎల్లారం చెరువులో కోదాడ, సూర్యాపేట, నేరేడుచర్ల ప్రాంతాల నుంచి చికెన్ వ్యర్థాలను తెచ్చి పారవేసి వెళ్తున్నారు. చేపలు పెరిగేందుకు మాంసం వ్యర్థాలను వేస్తుండటంతో పరిసరాలు కంపుకొడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ః మేళ్లచెరువు, మిర్యాలగూడ, దామరచర్ల, హుజూర్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న బియ్యం మిల్లులు, సిమెంట్ పరిశ్రమలు సైతం కాలువల ద్వారా సమీప చెరువుల్లోకి వ్యర్థాలను వదులుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లాలోని మోటకొండూరు, వలిగొండ, అడ్డగూడూరు, బీబీనగర్, చౌటుప్పల్, పోచంపల్లి, భువనగిరి మండలాల్లోని పలు గ్రామాల్లోని చెరువుల్లో కాలుష్య వ్యర్థాలను ఇష్టానుసారంగా వేస్తున్నారు. కొందరు రాత్రి రసాయన వ్యర్థాల ద్రావణాలను ట్యాంకర్ల ద్వారా తెచ్చి అత్యంత ప్రమాదకరమైన వ్యర్థాలను పారవేస్తున్నారు. తమ పరిశ్రమల పరిధిలోనే వ్యర్థాలను నిర్వీర్యం చేయాల్సి ఉండగా సమీపంలో, శివారులో ఉండే చెరువుల్లో అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా డంపింగ్ చేయడం గమనార్హం. ఈ నీటిని పొలాలకు ఉపయోగించడం వల్ల పంటలు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**నోటీసులు ఇస్తున్నాం** ఔషధ, సిమెంట్, రైస్‌మిల్లులు, రంగుల పరిశ్రమల నిర్వాహకులకు గతంలో నోటీసులు ఇచ్చి జరిమానాలు విధించాం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రధాన చెరువుల్లో మాంసం వ్యర్థాలను పారవేస్తున్న వారిపై నిఘా పెట్టి వారికి జరిమానాలు విధిస్తాం. క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులను పంపించి సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. అజయ్‌కుమార్, సీఈ, నీటిపారుదలశాఖ

# కోత పెట్టు.. కోతులపైకి నెట్టు!



నర్సాపూర్: నర్సాపూర్ డివిజన్ కేంద్రంలో కరెంట్ ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనెక్షన్లకు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో వినియోగదారుల అవస్థలు చెప్పనలవి కాదు.సరఫరాలో అంతరాయానికి కారణం అడిగితే, కోతుల మీదకు నెట్టేస్తున్నారు. వానరాలు విద్యుత్ నియంత్రికలపై దూకుతున్నాయని, తీగలపై వేలాడుతుండడంతో సమస్యలు తలెత్తుతున్నట్లు చెబుతున్నారు. నిర్వహణ లోపం ఉన్నా ఆ విషయాన్ని పట్టించుకోవడంలేదు. ఇక వార్డుల్లో తీగలు కిందకు వేలాడుతుండడం, నియంత్రికలపై అదనపు భారం పడి లోఓల్టేజి సమస్యలు ఎదురవుతున్నా సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మూడో తీగ సమస్యలు చాలా వార్డుల్లో ఉన్నాయి.

**12 వేల సర్వీసులు...ఇద్దరే ఉద్యోగులు**

పట్టణంలో మొత్తం 15 వార్డులుండగా 12వేల సర్వీసులున్నాయి. ఒక లైన్‌మెన్, సహాయ లైన్‌మెన్ మాత్రమే ఉన్నారు. ఇద్దరు ఆర్టిజన్లు ఉన్నారు. వీరే సరఫరాను పర్యవేక్షించాలి. ప్రస్తుత సర్వీసు కనెక్షన్లకు అనుగుణంగా ఐదుగురు లైన్‌మెన్లు ఉండాలి. విద్యుత్తు రీడింగ్, బిల్లుల వసూలు, బ్రేక్‌డౌన్లు తదితరాలను కూడా వీరే చూస్తున్నారు. మండలానికి ఒక లైన్‌మెన్, ఫోర్‌మెన్, ఏఈ ఉన్నా, వీరు క్షేత్రస్థాయిలో కనిపించరు.

**ఫ్యూజ్‌ఆఫ్‌కాల్ కార్యాలయం ఉన్నా..**

పట్టణంలో ఫ్యూజ్‌ఆఫ్ కాల్ కార్యాలయం ఉంది. దీనిని బిల్లుల వసూలుకు ఉపయోగిస్తున్నారు. తప్పితే అక్కడ సిబ్బంది కనిపించరు. సమస్య తలెత్తితే విద్యుత్తు సిబ్బంది ఎక్కడ ఉంటారో ఎవరికీ తెలియదు.

**ఫిర్యాదు అందిన వెంటనే స్పందిస్తున్నాం**

రమణారెడ్డి, ఏడీఈ

స్థానికంగా సిబ్బంది కొరత ఉన్నమాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. సమస్యపై ఫిర్యాదు అందిన వెంటనే తక్షణం స్పందిస్తున్నాం.

# కాగిత రహితం.. సేవలు పారదర్శకం



సంగారెడ్డి: విద్యాశాఖ జిల్లా కార్యాలయాల్లో అందుతున్న సేవల్లో పారదర్శకత లోపించిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల హన్మకొండ డీఈఓ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాల గుర్తింపు పునరుద్ధరణకు లంచం తీసుకుంటూ ఇన్‌ఛార్జి డీఈఓగా సేవలందిస్తున్న అదనపు కలెక్టర్ అవినీతి నిరోధక శాఖ(అనిశా)కు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పాఠశాలల రాష్ట్ర సంచాలకుడు తక్షణమే డీఈఓ కార్యాలయాల్లో ఈ-ఆఫీస్ సేవలు ప్రారంభించాలని ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను సైతం మంజూరు చేశారు. మెదక్ జిల్లాలో గత కొంతకాలంగా ఈ సేవలు అందుతున్నాయి. ఇదే మాదిరిగా సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లోని డీఈఓ కార్యాలయాల్లో అమలు చేస్తే పారదర్శక సేవలు అందనున్నాయి.

**ఆన్‌లైన్‌లోనే పరిశీలన**

డీఈఓ కార్యాలయం ఇన్‌వార్డులో వచ్చిన దరఖాస్తును సంబంధిత రికార్డు అసిస్టెంట్ స్కానింగ్ చేసి నంబరు కేటాయించి కార్యాలయ నిర్వహణ అధికారికి ఆన్‌లైన్‌లో పంపించాలి.

కార్యాలయ నిర్వహణ అధికారి దరఖాస్తును పరిశీలించి సెక్షన్ అధికారికి అసైన్ చేయాల్సి ఉంటుంది.

సెక్షన్ అధికారి నోట్‌ఫైల్ తయారు చేసి సవ్యంగా ఉంటే ఉన్నతాధికారికి ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ చేస్తారు. ఏవైనా అనుమానాలు ఉంటే దరఖాస్తుదారుకు తెలియజేయాలి. పూర్తి సమాచారం సేకరించిన అనంతరం ఫైల్ ముందుకు కదిలేలా చేయనున్నారు.

ఈ-ఆఫీస్ విధానంలో ముఖ్యంగా దస్త్రాలను ఈ-ఫైలింగ్ విధానం ద్వారా ఒక సెక్షన్ నుంచి మరో సెక్షన్‌కు చేరవేస్తారు.

**అందిపుచ్చుకుంటున్న మెదక్**

గత ఏడాదిన్నర నుంచి మెదక్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ-ఆఫీస్ సేవలు అమలు చేస్తున్నారు. అయితే జిల్లా కార్యాలయంలోనే ఈ సేవలందుతున్నాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టరేట్ నిర్దేశించిన ప్రకారం ఎంఈవో కార్యాలయాలతో పాటు స్కూల్ కాంప్లెక్స్‌లలోనూ ఈ- ఆఫీస్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. జిల్లా నుంచి మొదలుకొని పాఠశాల స్థాయి వరకు కాగితపు రహిత సేవలతో ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులకు సత్వర సేవలందనున్నాయి.

**ప్రధాన ప్రయోజనాలివి**

ఇన్‌వార్డు నుంచి మొదలుకొని డీఈఓ వరకు ఆ దస్త్రాన్ని ఎక్కడి నుంచైనా పరిశీలించేందుకు ఈ-ఫైలింగ్ విధానం ఉపయోగపడుతుంది. కాగిత రహిత సేవలను వినియోగించుకోవచ్చు.

సెక్షన్ సిబ్బంది లేదా అధికారి పరిశీలించాక కార్యాలయ సూపరింటెండెంట్‌కు పంపిస్తారు. అక్కడి నుంచి డీఈఓ లాగిన్‌కు చేరుతుంది. ఆయన పరిశీలించి, సవ్యంగా ఉంటే ఆమోదం తెలుపుతారు.. సవ్యంగా లేకుంటే వెనక్కి పంపిస్తారు.

సంగారెడ్డి, సిద్దిపేటల్లోనూ త్వరలో అమలు చేయనున్నట్లు ఆ జిల్లాల అధికారులు తెలిపారు.

# గృహ ప్రవేశానికి.. రారండోయ్!



మావల: బల్దియాలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు కొలిక్కి వస్తోంది. గతంలో నిర్వహించిన లక్కీ డ్రాలో ఎంపికైన లబ్ధిదారులతోపాటు ప్రజాపాలన కేంద్రాల్లో దరఖాస్తు చేసుకున్న అర్హులను గుర్తించి లబ్ధిదారుల జాబితా తయారు చేస్తున్నారు. అయితే గతంలో నిర్వహించిన లక్కీ డ్రాలో ఎంపికైన వారిలో 176 మంది లబ్ధిదారులు ఇప్పటిదాకా సర్వేకు చిక్కలేదు. లబ్ధిదారుల స్థితిగతులపై సర్వే చేసేందుకు వార్డు అధికారులు ఎంత వెతికినా అందుబాటులోకి రాకపోవడంతో ఉన్నతాధికారులకు నివేదించారు.

**618 ఇళ్లకు లక్కీ డ్రా**గత ప్రభుత్వ హయాంలో 170 కాలనీలో రూ.11.76 కోట్లతో 222 గృహాలు, కేఆర్కే కాలనీలో రూ.40.28 కోట్లతో 760 ఇళ్లతో జీ ప్లస్-2 తరహాలో ఇళ్ల సముదాయాలను నిర్మించారు. అయిదేళ్లకు పైగా అక్కడ వసతులు కల్పించకపోవడంతో ఇప్పటిదాకా కేటాయింపు జరగలేదు. 2023 మేలో దరఖాస్తు చేసుకున్న వారికి అప్పటి కలెక్టర్ రాహుల్ రాజ్ లక్కీ డ్రా నిర్వహించారు. మొత్తం 982 ఇళ్లలో 618 ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారి నేపథ్యాన్ని మరోసారి సర్వే చేసిన తర్వాత ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో లక్కీడ్రాలో ఎంపికైన వారిని మళ్లీ సర్వే చేసి ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది.

**అనాసక్తికి కారణాలు అనేకం**లబ్ధిదారుల సర్వేకు వార్డు అధికారులు ఇటీవల క్షేత్రస్థాయికి వెళ్లారు. రెండున్నరేళ్ల కిందట ఇచ్చిన వివరాలను బట్టి చిరునామా దొరకడం లేదు. ఫోన్ నెంబర్లు పనిచేయడం లేదు. కొందరు చనిపోవడం, మరికొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడంతో 618లో 176 మంది వివరాలు అందుబాటులో లేవు. డబుల్ బెడ్రూం ఇళ్లు అపార్ట్‌మెంట్ తరహాలో నిర్మించడం, అక్కడ కనీస వసతులు లేకపోవడంతో కొందరు సొంత స్థలంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు మక్కువ చూపుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఆ 176 మంది స్థానంలో అర్హులైన ఇతర లబ్ధిదారులకు కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

# వణికిస్తున్న చలి.. భయపెడుతున్న పులి

శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: శ్రీరాంపూర్ ఏరియా బొగ్గు గనుల సమీపంలో పెద్దపులి సంచారం స్థానికంగా భయాందోళనకు గురి చేస్తోంది.రాత్రి ఆర్కే-8 గని సమీపంలో సింగరేణి అంబులెన్సు డ్రైవర్‌కు బెబ్బులి కనిపించగా ఆ విషయం సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దీంతో ఏరియాలో పెద్దపులి తిరుగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. సమాచారం తెలుసుకొని అటవీశాఖ సిబ్బంది అదే రోజు రాత్రి అది కనిపించిన ప్రదేశానికి వెళ్లి ఆ మార్గంలో ఎవరూ వెళ్లకుండా నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం శ్రీరాంపూర్ ఉపరితల గని ఆవరణలోని బోర్‌వెల్ వైపు పులి పాదముద్రలను కార్మికులు గుర్తించగా అటవీ సిబ్బంది వాటిని నిర్ధారించారు. ప్రస్తుతం అది ఎస్సార్పీ ఓసీపీ-జైపూర్ రైల్వే ట్రాక్ లైన్‌లో వెళ్లి ఉంటుందని భావిస్తున్నారు. అటవీ శాఖ సిబ్బంది రామారావుపేట, ట్రాక్‌లైన్ వెంట గాలింపు చేపట్టారు. రాత్రి సమయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు, ఎస్అండ్‌పీసీ సిబ్బంది, సమీప ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. విధులకు గుంపులుగా వెళ్లాలని పేర్కొన్నారు. పడిపోతున్న ఉష్ో?గ్రతలు జిల్లాలో రోజురోజుకు పడిపోతున్న ఉష్ో?గ్రతలు సింగరేణి ఉద్యోగులపై ప్రభావం చూపుతున్నాయి. వారం రోజులుగా 10 డిగ్రీల సెల్సియస్‌కు కనిష‘ ఉష్ో?గ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. రెండో షిఫ్ట్ ముగించుకొని రాత్రి 10 గంటలకు ఇంటికి వెళ్లే ఉద్యోగులు, రాత్రి బదిలీ 11 గంటలకు, ఫ్రీ షిఫ్ట్ ఉదయం 5 గంటలకు విధులకు వచ్చే కార్మికులు చలి పంజా బారిన పడుతున్నారు.

# అయిదు తరగతులకు ఒకే పాఠం!

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేట మండలం రాఘవానితండా ప్రాథమిక పాఠశాలలో 17 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒక్కరే ఉపాధ్యాయురాలు. అయిదు తరగతులకు బోధన చేయాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితిలో ఆమె సెలవు కూడా పెట్టలేని పరిస్థితి. ఇక ఒకే పాఠం అయిదు తరగతుల వారు వినాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా 234 పాఠశాలల్లో ఇలాంటి దుస్థితే నెలకొంది.జిల్లా వ్యాప్తంగా: మెదక్ జిల్లా వ్యాప్తంగా 902 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రాథమిక పాఠశాలలు 623. వీటిలోనే అధికంగా 234 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో కొనసాగుతున్నాయి. వీటిల్లో విద్యార్థుల సంఖ్య 20 లోపే ఉండడంతో బోధనకు ఒక్కరినే కేటాయించారు. వీటిలో 51 పాఠశాలల్లో పదిలోపే విద్యార్థులు ఉండటం గమనార్హం. మారుమూల ప్రాంతాల్లో ఈబడులు కొనసాగుతుండటం వల్ల విద్యార్థుల సంఖ్య లేకపోవడం వల్ల ఉపాధ్యాయ పోస్టులు లేకుండా పోయాయి. అయితే ఉన్న విద్యార్థులకు



మాత్రం సరిగా బోధన అందడం లేదు. ఉన్న ఒక్క ఉపాధ్యాయులపై పాఠశాల నిర్వహణ బాధ్యత పడటంతో బోధనకు పూర్తి స్థాయి సమయం దొరకడం లేదు.

**తప్పని ఇబ్బందులు**

ఉపాధ్యాయులకు యూడైస్ ఆన్‌లైన్ పని, మధ్యాహ్న భోజన పర్యవేక్షణ, హాజరు, ప్రధానోపాధ్యాయుల సమావేశాలు వంటి పనులతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాలలతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అవస్థలు తప్పడం లేదు. బోధన సరిగా సాగక విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయి. ఉన్న ఒక్క ఉపాధ్యాయులు అన్ని తామై నడిపించడం భారంగా మారుతోంది. ఉపాధ్యాయులకు అత్యవసర పరిస్థితిలో సెలవుపై వెళ్లాలంటే ప్రత్నామ్నాయంగా ఒక ఉపాధ్యాయులైనా, సీఆర్పీ అయినా పాఠశాలకు రావాల్సిందే. పాఠశాల మూసేయకుండా ఉండేలా ఆదేశాలు ఉండడంతో సెలవు తీసుకోవడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యావాలంటీర్లు ఉన్న సమయంలో వెసులుబాటు ఉండేది. ఈ పాఠశాలల ఉపాధ్యాయులు పాఠశాల సముదాయ సమావేశాలు, దృశ్యసమీక్షలు వంటి ఇతర సమావేశాలకు వెళ్లాలంటే ప్రత్యామ్నాయం వెతుక్కోవాల్సి వస్తోంది. ఇలా ఇబ్బందులు నడుమ ఏకోపాధ్యాయ పాఠశాలలు కొనసాగక తప్పడం లేదు.

**మూతపడకుండా చర్యలు**

ఏకోపాధ్యాయ పాఠశాలలు ఇబ్బందులు నడుమ కొనసాగుతున్నా విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తున్నాం. వాటిని మూసివేయకుండా ప్రత్యామ్నాయంగా అక్కడ ఏర్పాటు చేస్తున్నాం. విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల్లోనే ఈ పరిస్థితి ఏర్పడుతోంది. సంఖ్య పెరిగితే ఉపాధ్యాయుల సర్దుబాటు, పోస్టుల మంజూరు చేసే అవకాశం ఉంటుంది. రాధాకిషన్ జిల్లా విద్యాధికారి

# తెలుసుకో.. జాగ్రత్తగా మసలుకో!


సిద్దిపేట : మారిన పరిస్థితుల్లో చరవాణి తోడుగా.. ఆన్‌లైన్ వేదికగా లావాదేవీలకు ప్రాధాన్యం పెరిగింది. ఇదే అదనుగా సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. కేవైసీ నమోదు.. నవీకరణ పేరిట.. గాలం వేసి బురిడీ కొట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని బ్యాంకు అధికారులు సూచిస్తున్నారు. ఎలాంటి సందర్భాల్లో ఈ కేవైసీ(నో యువర్ కస్టమర్) అవసరం.. ప్రక్రియను ఎక్కడ.. ఎలా చేపట్టాలనే సమాచారం మీకోసం..

**పథకాల లబ్ధిదారులకు..**

ప్రభుత్వ రాయితీ, వివిధ పథకాల కింద లబ్ధి పొందాలంటే డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) కింద బ్యాంకులు ఆధార్, మొబైల్ నంబరు, ఇతర వివరాలు(కేవైసీ) జత చేయాలని సూచిస్తుంటాయి. ప్రధానంగా ఉపాధి హామీ కూలీలు, రైతులు, చేయూత పింఛనర్లు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నగదు జమ క్రమంలో ప్రత్యేకంగా అడుగుతుంటాయి. ఖాతాకి ఆధార్, పాన్ కార్డును లింకు చేసుకోవాల్సిందిగా అధికారులు సూచిస్తుంటారు.

**మూడు విభాగాల్లో పరిశీలన**

బ్యాంకు వినియోగదారులను మూడు కేటగిరీలుగా విభజిస్తారు. లో రిస్క్ (చిరువ్యాపారులు, ఉద్యోగులు) పదేళ్లకోసారి, మీడియం రిస్క్(స్థిరాస్తి, ఉన్నత స్థాయి వ్యాపారులు, కంపెనీలు నిర్వహించే వారు) ఎనిమిదేళ్లకోసారి, హైరిస్క్(ఎగుమతి-దిగుమతి వ్యాపారులు, అధిక రిస్కు దేశాల్లో ఉండేవారు, నేర చరితులు) రెండేళ్లకోసారి రీ-కేవైసీ చేయాలి.



**వీరు బ్యాంకుకు వెళ్లాల్సిందే..**

సంతకాలు, ముఖ కదలికలు, వివిధ రకాల వివరాల మార్పు సహజంగా జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఖాతాదారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా బ్యాంకులు ఆహ్వానిస్తుంటాయి. లావాదేవీలు సక్రమంగా చేపట్టేందుకు, నవీకరణకు పునః ప్రక్రియ దోహదం చేస్తుంది. ఖాతా ఏడాది నుంచి రెండేళ్ల పాటు వినియోగించకుంటే ఇన్‌యాక్టివ్ దశలోకి వెళ్తుంది. బ్యాంకు ద్వారా వడ్డీ లాంటివి జమ అయినా.. ఖాతాదారుల లావాదేవీలు మాత్రం స్తంభిస్తాయి. రీ-కేవైసీ, ఈ-కేవైసీ పత్రాల సమర్పణను బ్యాంకుల్లో నేరుగా ఖాతాదారు చేపట్టడం ఉత్తమం. **నేరుగా సంప్రదించాలి**హరిబాబు, ఎల్‌డీఎం, సిద్దిపేట

రెండేళ్లుగా ఖాతాను వినియోగించని వారు సంబంధిత బ్యాంకుల్లో అధికారులను నేరుగా సంప్రదించాలి. నిర్దేశిత ధ్రువపత్రాలతో కేవైసీ ఫారాన్ని పూరించి సమర్పించాలి. గుర్తుతెలియని, అనుమానిత నంబర్ల నుంచి వచ్చే లింకులు, ఫోన్లకు స్పందించవద్దు.




# ఇరుసుమండలో బ్లో అవుట్‌కు కారణాలేంటి?

భారీ శబ్దం, పెద్ద ఎత్తున మంటలు, కాలిపోయిన పచ్చని కొబ్బరి చెట్లు, అంతా గందరగోళం.. కాసేపట్లోనే గ్రామం అంతా ఖాళీ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండలో తలెత్తిన పరిస్థితి ఇదీ! పచ్చని కోనసీమలో బ్లోఅవుట్ ప్రజలను మరోసారి భయభ్రాంతులకు గురి చేసింది. క్రూడ్ ఆయిల్‌తో కూడిన గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడమే కాస్త ఊపిరి పీల్చుకునే అంశం. కానీ, క్రమంతప్పని ప్రమాదాలతో అక్కడి ప్రజలు వణికిపోతున్నారు.

# బ్లోఅవుట్ ప్రమాదం.. సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇరుసుమండలో జరిగిన బ్లోఅవుట్ ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆ ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితులను ఉన్నతాధికారులు ఆయనకు వివరించారు. గ్యాస్ లీకేజీని అరికట్టేందుకు, ప్రజల రక్షణకు వివిధ విభాగాలు తీసుకుంటున్న చర్యలను హోంమంత్రి అనిత, సీఎస్ విజయానంద్, ఇతర అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతారని.. వారికి ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితి వివరించి అండగా నిలవాలని సీఎం చంద్రబాబు సూచించారు. సమస్య పూర్తిగా తీరే వరకు ఇళ్లు, ఊళ్లు వదిలిన వారు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందన్నారు. మంటల కారణంగా కొబ్బరి చెట్లు కాలిపోయిన వారికి పరిహారం అందించాలని ఆదేశించారు. మంటలను అరికట్టేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవసరమైన ఏజెన్సీల సాయాన్ని తీసుకోవాలని సూచించారు. అక్కడ సాధారణ పరిస్థితి నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరంగా పూర్తి సహకారం అందించాలని చెప్పారు. భవిష్యత్తులో ఈ తరహా ఘటనలు జరగకుండా ఓఎన్జీసీ సహా ఇతర భాగస్వామ్య సంస్థలతో త్వరలో సమావేశం నిర్వహించాలని చంద్రబాబు ఆదేశించారు.





అమరావతి: భోగాపురం విమానాశ్రయానికి అనుమతులు తెచ్చామంటూ వైకాపా అవాస్తవాలు ప్రచారం చేస్తోందని తెదేపా నేత పట్టాభిరామ్ అన్నారు. 2016లోనే సైట్ క్లియరెన్స్ అనుమతులను సీఎం చంద్రబాబు సాధించారని చెప్పారు. భూసేకరణతో పాటు రైతులకు నష్టం జరగకుండా జీవో ఇచ్చారన్నారు. విమానాశ్రయానికి చంద్రబాబే అంకురార్పణ చేశారని వివరించారు. భోగాపురం విమానాశ్రయంపై పట్టాభి ప్రజెంటేషన్ ఇచ్చారు. "భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు ఎస్‌పీవీ ఏర్పాటుచేశారు. దీనికోసం అధికారులను నియమించారు. చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నట్లు వైకాపా పేటీఎం బ్యాచ్‌లు ఆరోపిస్తున్నాయి. వైకాపా పాత్ర లేకపోయినా తామే చేసినట్లు చెప్పుకొంటున్నారు. విమానాశ్రయం నిర్మాణాన్ని అడ్డుకుంటామని పార్టీ నేతలు గతంలో వ్యాఖ్యానించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు క్రెడిట్ చంద్రబాబుకే దక్కుతుంది. ఈ ప్రాజెక్టు వేగవంతానికి 2017లోనే స్టీరింగ్ కమిటీ ఏర్పాటైంది. కీలకమైన పర్యావరణ అనుమతులు తీసుకొచ్చాం" అని పట్టాభి వివరించారు.




# పరకామణి కేసులో పోలీసులకు హైకోర్టు షాక్

అమరావతి : ఏపీలో సంచలనం సృష్టించిన పరకామణి కేసులో ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న పోలీసు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని హైకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పరకామణి కేసుపై ఈరోజు హైకోర్టులో విచారణకు రాగా.. కేసు దర్యాప్తులో ముందుకు సాగాలని సీఐడీ, ఏసీబీని న్యాయస్థానం ఆదేశించింది. కౌంటింగ్ అంశంలో టేబుల్ ఏర్పాట్లపై సూచనలివ్వాలని హైకోర్టు స్పష్టం చేసింది. నిందితులతో కొందరు పోలీసులు చేతులు కలిపినట్లు సీఐడీ నివేదికలో స్పష్టంగా ఉందని.. వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చోరీ కేసు మినహా సీఐడీ, ఏసీబీ దర్యాప్తులో తేలిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగించుకోవచ్చని తేల్చిచెప్పింది. తదుపరి విచారణను హైకోర్టు ఎల్లుండికి (జనవరి 8) వాయిదా వేసింది. కాగా.. ఈ కేసులో అప్పటి సీఐ జగన్ మోహన్ రెడ్డి, టూటౌన్ సీఐ చంద్రశేఖర్‌తో పాటు నిందితుడు రవికుమార్ ఆస్తులను పరిశీలించిన ఎస్ఐ లక్ష్మ రెడ్డికి కూడా ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఈ ముగ్గురు పోలీసు అధికారులను పోలీస్ శాఖ వీఆర్‌కు పంపించింది. అయితే ఈ కేసుతో ప్రమేయం ఉన్న పోలీసులపై చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు ఆదేశాలతో ఈ ముగ్గురిపై ఏపీ సీఐడీ కేసు నమోదు చేసే అవకాశం ఉంది. అలాగే ఈ కేసుకు సంబంధించి కొన్ని పత్రాలను తారుమారు చేశారనే అభియోగాలు ఎదుర్కొంటున్న వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేస్తారా? లేదా? అన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# ఉచిత ఇసుక పాలసీని సమర్థంగా అమలు చేయాలి: మంత్రి కొల్లు రవీంద్ర



రాజమహేంద్రవరం: ఉచిత ఇసుక పాలసీని ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను మంత్రి కొల్లు రవీంద్ర (ఖశీశ్రీశ్రీబ ఘుజఱఅనతీఖు) ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లాలో మైన్స్, జియాలజీ శాఖ పనితీరుపై కలెక్టరేట్ సమవేశమందిరంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇసుక తవ్వకం నుంచి రవాణా వరకు ఏపీ ఎస్ఎంఎస్ ద్వారా పూర్తిస్థాయి డిజిటల్ పర్యవేక్షణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. అధిక లోడ్, అక్రమ మైనింగ్, అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక రవాణాలో బిల్లులు తప్పనిసరి అని, ప్రజల సంతృప్తి ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఇసుక లభ్యత, సరసమైన ధరలపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా క్షత్రస్థాయిలో పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు.




# అక్కడ దీపం వెలిగించొచ్చు: 'కార్తిక దీపం' ఉత్తర్వులను సమర్థించిన హైకోర్టు

చెన్నై: తిరుప్పరకుండ్రం కొండపై కార్తిక దీపం వెలిగించే విషయంలో తమిళనాడు డీఎంకే ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. మదురైలోని ఈ కొండపై ఉన్న దీప స్తంభంలో దీపం వెలిగించేందుకు అనుమతినిస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను మద్రాసు హైకోర్టు తాజాగా డివిజన్ బెంచ్ సమర్థించింది. ఆ స్తంభంలో దీపం వెలిగించొద్దని ఆగమశాస్త్రంలో పేర్కొన్నట్లు వ్యాజ్యదారులు బలమైన ఆధారాలు చూపించలేకపోయారని డివిజన్ బెంచ్ వెల్లడించింది. ఈ సందర్భంగా దీపం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం లేవనెత్తిన అభ్యంతరాలను ధర్మాసనం తిరస్కరించింది. ఏడాదిలో ఒకరోజు ఆ స్తంభంలో దీపం వెలిగిస్తే శాంతిభద్రతలకు ఆటంకం కలుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొనడం హాస్యాస్పదం అని ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఈ విషయాన్ని అనవసరంగా రాజకీయం చేశారంటూ కోర్టు అభిప్రాయపడింది. ఈ దీపస్తంభం సుబ్రమణ్యస్వామి ఆలయానికి చెందినదే అని న్యాయస్థానం స్పష్టం చేసింది.

**కేసు వివాదం ఇదీ..** తిరుప్పరకుండ్రం కొండపై ఉచ్చి పిళ్లైయార్ ఆలయం వద్ద కార్తిక దీపోత్సవం సందర్భంగా ఏటా దీపం వెలిగిస్తారు. అయితే, ఈ కొండపై సికందర్ దర్గాకు 15 మీటర్ల దూరంలో ఉన్న దీపస్తంభం పైనా దీపం వెలిగించేందుకు అనుమతినివ్వాలంటూ రామ రవికుమార్ అనే వ్యక్తి గతేడాది డిసెంబరులో మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. ఆయన పిటిషన్‌పై విచారణ జరిపిన మదురై బెంచ్ సింగిల్ జడ్జి.. ఆ స్తంభంపైనా దీపం వెలిగించేందుకు అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ.. అక్కడ ఏర్పాట్లు చేయలేదని పిటిషనర్ మళ్లీ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మదురై ధర్మాసనంలో భద్రతా విధుల్లో ఉన్న సీఐఎస్ఎఫ్ సిబ్బందితో వెళ్లి దీపం వెలిగించుకోవచ్చని పిటిషనర్‌కు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. అప్పటికే ఉచ్చి పిళ్లైయార్ ఆలయం వద్ద సుబ్రహ్మణ్యస్వామి ఆలయ నిర్వాహకుల తరఫున కార్తిక దీపం వెలిగించారు. దర్గా సమీపంలో దీపం వెలిగించేందుకు రామ రవికుమార్, హిందూ నేతలతో ప్రయత్నించగా.. తోపులాట జరిగి పలువురు పోలీసులు గాయపడ్డారు. దీంతో ఈ కొండ వద్ద 144 సెక్షన్ విధించారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం, దర్గా ప్రతినిధులు డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపైనే నేడు డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది.




వెనెజువెలాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కారకాస్‌లోని అధ్యక్ష భవనం సమీపంలో కాల్పుల శబ్దాలు వినిపించాయి. ఉపాధ్యక్షురాలైన డెల్సీ రోడ్రిగ్జ్.. వెనెజువెలా అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన కొన్ని గంటల తర్వాత ఇవి చోటుచేసుకున్నట్లు మీడియాలో కథనాలు తెలిపాయి. సెంట్రల్ కారకాస్‌లోని మిరోఫ్లోర్స్ ప్యాలెస్‌పై డ్రోన్‌లు ఎగరడాన్ని అక్కడి భద్రతా దళాలు గుర్తించి వాటిపై కాల్పులు జరిపాయి. కాగా, ప్రస్తుత పరిస్థితి అదుపులోనే ఉందని వెనెజువెలా అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక, దాదాపు ఓ నిమిషం పాటు కాల్పుల శబ్దాలు వినిపించాయని, అయితే అవి అంత తీవ్రంగా లేవని అధ్యక్ష భవనం సమీపంలోని ఓ నివాసి పేర్కొన్నాడు. ఈ తాజా కాల్పులపై అమెరికా స్పందించింది. ఇందులో తమ ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేసింది. వెనెజువెలాలో పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నామని అమెరికా అధికారి ఒకరు తెలిపారు. మరో ఘటనలో అధ్యక్ష భవనం వద్ద భద్రత నిర్వహించే పారామిలిటరీ సభ్యుల మధ్య సమన్వయలోపం వల్ల కాల్పులు జరిగినట్లు సీఎన్ఎన్ తన కథనంలో పేర్కొంది.

# పర్యావరణ పరిరక్షణపై పవన్ కల్యాణ్ స్పెషల్ ఫోకస్.. అధికారులకు కీలక ఆదేశాలు



అమరావతి, జనవరి 6 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ణ ప్రాజెక్ట్‌పై ఏపీ సచివాలయంలో ఇవాళ(మంగళవారం) సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. అనంతరం అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఈ సమావేశంలో ప్రాజెక్ట్ లక్ష్యలు, అమలు విధానం, కాలపరిమితి, పర్యావరణ ప్రయోజనాలపై విస్తృతంగా చర్చించారు. ప్రాజెక్ట్ అమలుకు అవసరమైన శాఖల సమన్వయం, నిధుల వినియోగం, దశలవారీ కార్యాచరణపై మాట్లాడారు.

**2030 నాటికి గ్రీన్ వాల్ నిర్మాణ లక్ష్యం...** అధికారుల వివరాల ప్రకారం, ఈ ప్రతిష్ఠాత్మక పర్యావరణ ప్రాజెక్ట్‌ను 2030 నాటికి పూర్తి చేయడమే లక్ష్యంగా నిర్దేశించారు. రాష్ట్రంలోని 1,034 కిలోమీటర్ల తీరప్రాంతం వెంట 5 కిలోమీటర్ల వెడల్పుతో గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఈ గ్రీన్ వాల్ ద్వారా తీరప్రాంతాలను పర్యావరణ పరంగా బలోపేతం చేయడంతో పాటు, భవిష్యత్తు తరాలకు సుస్థిరమైన సహజ వనరులు అందుబాటులో ఉంచడం ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు.

**తుఫానులు, సముద్ర మట్టం పెరుగుదల నుంచి రక్షణ....** ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడారు. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్ట్‌ను జీవన పర్యావరణ కవచంగా అభివర్ణించారు. తుఫానులు, సముద్ర మట్టం పెరుగుదల, తీర ప్రాంత కోత వంటి ప్రకృతి విపత్తుల నుంచి ప్రజలను, భూభాగాన్ని రక్షించడంలో ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ప్రత్యేకంగా తీరప్రాంత గ్రామాలు ఎదుర్కొంటున్న పర్యావరణ ప్రమాదాలకు ఇది దీర్ఘకాలిక పరిష్కారంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్ట్‌ను ఆంధ్రప్రదేశ్‌కు పర్యావరణ పరంగా మైలురాయిగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. శాస్త్రీయ పద్ధతులు, నిపుణుల సూచనలతో ఈ ప్రాజెక్ట్ అమలు చేయాలని స్పష్టం చేశారు.

**జీవవైవిధ్యం, జీవనోపాధి పెంపే లక్ష్యం...** ఈ ప్రాజెక్ట్ ద్వారా కేవలం పర్యావరణ రక్షణే కాకుండా, జీవవైవిధ్యాన్ని పెంపొందించడం, స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు సృష్టించడం కూడా లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. మత్స్యకారులు, తీరప్రాంత రైతులు, అటవీ ఆధారిత జీవనోపాధులపై ఆధారపడే వర్గాలకు ఈ ప్రాజెక్ట్ ద్వారా లాభం చేకూరుతుందని వివరించారు.

**ఆఫ్రికన్ గ్రేట్ గ్రీన్‌వాల్ నుంచి ప్రేరణ...** ఈ ప్రాజెక్ట్ రూపకల్పనకు ఆఫ్రికన్ గ్రేట్ గ్రీన్‌వాల్ నుంచి ప్రేరణ పొందినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధానంగా మడ అడవులు (మ్యాంగ్రోవ్స్), సరుగుడు ఉప్పు తట్టుకునే ఇతర చెట్ల జాతులు నాటడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఇవి తీర ప్రాంతాల్లో మట్టి కోతను అడ్డుకోవడంలో, పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలకంగా పనిచేస్తాయని అధికారులులు సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతీలాల్ దండే, ప్రిన్సిపల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్సు పీవీ చలపతి రావు, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఫ్లెక్సీ తొలగింపు.. ఉద్రిక్తం




గుంటూరు, జనవరి 6: జిల్లాలోని తెనాలిలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజా ఫ్లెక్సీల తొలగింపుపై రగడ చోటు చేసుకుంది. ఫ్లెక్సీ తొలగింపుపై టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఫ్లెక్సీ తొలగింపుపై మున్సిపల్ అధికారులతో తెలుగు దేశం నేతలు ఘర్షణకు దిగారు. దీంతో తెనాలిలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. వాహబ్ చౌక్ వద్ద డివైడర్ మధ్యలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజా ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అయితే ఈ ఫ్లెక్సీని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. దీంతో మున్సిపల్ సిబ్బంది తీరుపై టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీ తొలగింపుపై టీడీపీ నాయకులు రోడ్డు మీద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలుగు దేశం నేతల ఆందోళనతో అక్కడకు వచ్చిన మున్సిపల్ సిబ్బందితో వారు వాగ్విదానికి దిగారు. ఫ్లెక్సీని ఎలా తొలగిస్తారంటూ వారిని నిలదీశారు. ఈ క్రమంలో మున్సిపల్ సిబ్బంది, తెలుగు తమ్ముళ్లకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అక్కడ టెన్షన్ వాతావరణం నెలకొంది. టీడీపీ నేతల ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## సినిమాల్లో ఆడవాళ్లను ఆట వస్తువులుగా!

మారుతున్న ప్రపంచంలో మహిళల ప్రవర్తనలో చాలా మార్పులొచ్చాయి. పెరిగిన విద్య, సామాజిక జ్ఞానం, ఆర్థిక స్వేచ్ఛ కారణంగా స్త్రీలు ఇప్పుడు పురుషుల కంటే చాలా ఎక్కువ. స్త్రీ ఆకాశం ఎత్తు. అసలు మహిళ సాధించనిది లేనే లేదు. అంతరి క్షంలోకి కూడా ప్రయాణించగలదు. అయితే బాగా ఎదిగిన లేదా ప్రగతిశీల మహిళను పురుషాహంకారులు చూసే విధానం వేరు. ధైర్యంగా ప్రశ్నిస్తే లేదా ఎదురిస్తే ఆ మహిళను అహంకారి అని, దుర్మార్గురాలు అని ముద్ర వేస్తారు. కళారంగంలోనూ కథానాయికలను మారుతున్న వివిద దశలలో రకరకాల కోణాల్లో ఆవిష్కరించారు.

**మహిళా పాత్రాల్లో ఎన్నో మార్పులు:** ప్రతి దశాబ్దానికొకసారి మహిళా పాత్రల చిత్రణ పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు సెలిగా, టూమచ్ బోల్డ్‌గా కూడా చూపించారు. కొన్నిసార్లు వ్యాంపులుగా, ఐటమ్ గాళ్స్‌గా కూడా చూపించారు. 90లలో స్త్రీ పాత్రలకు గ్లామర్ ఎక్కువగా అద్దారు. వ్యాంప్ పాత్రలు కూడా అప్పట్లో ఎక్కువ. కానీ కాలక్రమంలో చాలా మారింది. పొగ తాగే లేదా మద్యానికి బానిసైన స్త్రీని కూడా 2000 –2010 మధ్యలో చూపించారు. పార్టీలో నైట్ క్లబ్ లలో కనిపించే స్త్రీ పాత్రలను నాటి దర్శక రచయితలు రాసుకు నేవారు. అయితే ఇటీవలి కాలంలో నాయికా ప్రధాన చిత్రాలు పెరిగాయి.



**రాశీఖన్నా ఇవి గుర్తించలేదా:** కథానాయికల రేంజ్ పెరిగింది. అనుష్కశెట్టి, నయనతార, కీర్తి సురేష్, సమంత, రష్మికా మందన్నా దక్షిణాదిలో ఏ స్థాయికిచేరారన్నది చెప్పాల్సిన పనిలేదు. దీపిక పదుకొణే, ఆలియా భట్, కత్రినా కైఫ్ వంటి నటీమణులు స్పై ఏజెంట్లుగా, పోలీస్ అధికారులగా నటించి మేల్ పాత్రలతో పోటీపడుతున్నారు. ఇదంతా కళారంగంలో మహిళా నటీమణుల సాధించిన పురోగతిగానే చెప్పాలి. ఇంకా ముందుకెళ్తే మేల్ పాత్రలకు ధీటుగా ఛాన్స్ వచ్చినప్పుడల్లా సత్తా చాటుతున్నారు. మరి ఇవన్నీ నటి రాశీఖన్నా గమనించిందో? లేదో తెలియదు గానీ..

**ఇదేం వివక్ష అంటోన్న నటి:** తాజాగా సినిమాల్లో ఆడవాళ్లను ఆట వస్తువుల్లా చూపిస్తున్నారని ఆరోపించింది. ఈ వివక్ష చాలా కాలంగా కొనసాగుతుందని అభిప్రాయపడింది. అన్ని చిత్ర పరిశ్ర మల్లోనూ నటీమణుల పరిస్థితి ఇలాగే ఉందంది. మహిళా పాత్రలు ఇంకా తాను అనుకున్న స్థాయిలో రావడం లేదంది. భవిష్యత్తులోనైనా మార్పులొస్తాయేమోనని ఎదురు చూస్తానంది. చాలా మంది నటీమణులు దీన్నో సమస్యగా భావిస్తున్నట్లు పేర్కొంది. గతంలో రీచా చద్దా కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. ప్రస్తుతం రాశీఖ న్నా హిందీలో బ్రిడ్జ్, తాల్కోన్ మెయిన్ ఏక్ చిత్రాల్లో నటిస్తోంది. అలాగే కొన్నికొత్త కథలు కూడా విందని..వాటికి త్వరలోనే సైన్ చేస్తుందని సమాచారం.

## జెలో 168క్యారెట్ల నెక్లెస్ డిజైన్‌కి 1800 గంటలు

భారతీయ సంస్కృతి – సాంప్రదాయం విలువ ఎంతో అంతర్జాతీయ సెలబ్రిటీలు కూడా తెలుసుకుంటున్నారు. మన దేశంలోని కుభేరుల పెళ్లిళ్లలో ప్రదర్శనల కోసం వచ్చినప్పుడు కనీసం 4 రోజుల నుంచి 7రోజుల వరకూ ఇక్కడే ఉండి, భారతీయ వెడ్డింగ్ కల్చర్ గురించి తెలుసుకుని, పెళ్లిలో ప్రదర్శనలతో అలరించి మరీ వెళుతున్నారు. వెళ్లేప్పుడు భారీగా ప్యాకేజీలు కూడా అందుకుంటున్నారు. ఇదే కేటగిరీలో ఇంతకుముందు రిహానా, మొన్నటికి మొన్న జెన్నిఫర్ లోపెజ్ వంటి అంతర్జాతీయ పాప్ గాయనీమణులు తమ ప్రదర్శనలతో రక్తి కట్టించారు. అలాగే అమెరికన్ షోలతో పాపులరైన కిమ్ కర్థాషియన్–కోలీ కర్థాషియన్ లాంటి అందగత్తెలు కూడా అంబానీల ఈవెంట్లలో మెరిసారు. కొన్ని దశాబ్ధాలుగా ఈ కల్చర్ ఇలానే కొనసాగుతోంది. భారతదేశంలోని ప్రముఖుల ఇళ్లలో వేడుకల్లో నృత్యం చేసేందుకు అంతర్జాతీయ పాప్ స్టార్లు ఆసక్తిని కనబరచడం ఎప్పుడూ చర్చనీయాంశమే. ఇటీవలే తెలుగమ్మాయి, ఎన్నారై నేత్ర మంతెన – వంశీ గాదిరాజు పెళ్లిలో మరో ప్రముఖ పాప్ స్టార్ జెన్నిఫర్



లోపేజ్ చేసిన సందడి అంతా ఇంతా కాదు. jloగా సుప్రసిద్ధురాలైన ఈ గాయని ఇటీవల భారతదేశాన్ని సందర్శించినప్పుడు ఇనాయ బ్లష్ – ఎంఎం శారీలో హృదయాలను గెలుచుకుంది. ఈ చీర కోసం ఉపయోగించిన డిజైనర్ వర్క్ నిజంగా ఆశ్చర్యపరుస్తోంది. స్ఫటికాలతో అలంకరించిన కట్ వర్క్ పల్లు ప్రత్యేక ఆకర్షణ. ఈ డిజైన్ మనీష్ మల్హోత్రా సిగ్నేచర్ లుక్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. రాజవంశపు మహారాణిలా ఖరీదైన నెక్లెస్‌తో లుక్ ఎంతో వైబ్రేంట్ గా కనిపిస్తోంది. జెలో లుక్ కి తగ్గ ఆభరణాన్ని ఎంపిక చేసుకుంది. భారతీయ మహారాణిలోని ఔన్నత్యాన్ని ప్రతిబింబించేలా అందమైన పచ్చల ఆభరణం ప్రత్యేక ఆకర్షణగా మారింది. ఈ ఆభరణంలో రంగు రాళ్లు చాలా ప్రత్యేకతతో ఆకట్టుకున్నాయి. 168 క్యారెట్లకు పైగా పచ్చలతో.. దాదాపు 1,800 గంటలకు పైగా సమయం తీసుకుని రూపొందించిన ఈ షో పీస్ మనీష్ మల్హోత్రా జువెలరీ బ్రాండ్ నుంచి ఎంపిక చేసుకున్న స్పెషల్ పీస్. రెండు విభిన్నమైన ఆకుపచ్చ రంగులతో.. చెవిపోగులు, సిగ్నేచర్ పామ్ కఫ్‌లు, డైమండ్ బ్యాంగిల్, ఉంగరంతో మహారాణినే తలపిస్తోంది జెలో.




## 6 ఏళ్లయినా తగ్గని ద్రౌపది వివాదం.. చిన్మయికి డైరెక్టర్ షాక్



టాలీవుడ్ , కోలీవుడ్ అంటూ భాషతో సంబంధం లేకుండా తన అద్భుతమైన గాత్రంతో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన ప్రముఖ సింగర్ చిన్మయి గాయని మాత్రమే కాదు డబ్బింగ్ ఆర్టిస్ట్ కూడా.. ఎంతోమంది హీరోయిన్స్ కి తన గాత్రాన్ని దానం చేసి ఆ వాయిస్ తోనే మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది.అలా ఒకవైపు సింగర్ గా.. మరొకవైపు డబ్బింగ్ ఆర్టిస్ట్ గా పేరు దక్కించుకున్న ఈమె.. సోషల్ మీడియాలో ఎంత యాక్టివ్ గా ఉంటుందో అందరికీ తెలిసిందే. ముఖ్యంగా ఫెమినిజం మీద పోరాటం చేసే సింగర్ చిన్మయికి, నెటిజన్స్ కి మధ్య సోషల్ మీడియాలో గొడవలు ఒక రేంజ్ లో జరుగుతూ ఉంటాయి. ముఖ్యంగా ఆడవాళ్లను, పిల్లలను దూషించి హింసించే వారిపై తనదైన రీతిలో స్పందిస్తూ ఉంటుంది. దీనికి తోడు ఇటీవల డీప్ ఫేక్ వీడియోలపై స్పందించిన ఈమె అందరికీ ఒక మంచి ఇన్ఫర్మేషన్ కూడా ఇచ్చింది. తమ ఫోటోలను ఎవరైనా మార్ఫింగ్ చేసి అసభ్యకరంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే.. ఎలా డిలీట్ చేసుకోవచ్చో కూడా చెప్పి అందరికీ ఊరట కలిగించింది. అలాగే శివాజీ మహిళలపై వస్త్రధారణ గురించి చేసిన కామెంట్లకు కూడా స్పందించి వైరల్ అయింది చిన్మయి. అయితే అలాంటి ఈమెకు తాజాగా ద్రౌపది డైరెక్టర్ మోహన్ జీ భారీ షాక్ ఇచ్చారు. తాజాగా జరిగిన పరిస్థితులను బట్టి చూస్తుంటే ఆరు సంవత్సరాలైనా ఇంకా ఈ వివాదం తగ్గలేదా అనే కామెంట్లు కూడా వ్యక్తమవుతున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. గత ఆరు సంవత్సరాల క్రితం.. ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు మోహన్ జీ తమిళంలో ద్రౌపది అనే సినిమా తీశారు. అప్పట్లో ఇది చాలా వివాదాస్పదంగా నిలిచింది. అటు కమర్షియల్ గా కూడా పెద్దగా స్ఫస్ సాధించలేదు. పైగా మహిళా సంఘాలు , పలువురు కార్యకర్తలు కూడా ఈ సినిమాపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ కంటెంట్ మీద విరుచుకుపడ్డారు. అయితే అలాంటి వాళ్లలో చిన్మయి కూడా ఉన్నారు. ముఖ్యంగా మోహన్ జీ ఆడవాళ్ళను కించపరుస్తున్నారని.. కులాల మధ్య గొడవ పెట్టేలా కథలు రాస్తున్నారని కూడా ఆమె విమర్శించారు. దాంతో మోహన్ జి మాట్లాడుతూ చిన్మయి కేవలం ఒక వర్గానికి పక్షపాతిగా మాత్రమే మాట్లాడుతోంది. కానీ నేను నిజాన్నే చూపించానని చెప్పారు. అలా ఆ సమయంలో వాదోపవాదనలు పెద్దగానే జరిగాయి ఇక తర్వాత కాలక్రమేనా ఆ విషయాన్ని అందరూ మర్చిపోయారు. ఇప్పుడు ఆరేళ్ల తర్వాత ఆ ద్రౌపది సినిమాకు స్వీల్ గా ద్రౌపది 2 కూడా వస్తోంది. అయితే ఇది ఈసారి పాన్ ఇండియా భాషల్లో వస్తూ ఉండడం గమనార్హం. ఇక్కడ అసలు విషయం ఏమిటంటే.. ఈ చిత్రంలో చిన్మయితో ‘ఏమోకే ’ అనే పాట పాడించారు ఈ చిత్ర సంగీత దర్శకుడు జిబ్రాన్. ప్రస్తుతం ఈ ఆడియో అటు యూట్యూబ్లో కూడా ఉంది. అయితే ఇప్పుడు చిన్మయి స్థానంలో వేరే సింగర్ తో ఆ పాటను పాడించి థియేటర్లలో ప్రదర్శిస్తామని మోహన్ జీ చెప్పుకొచ్చారు. నిజానికీ గత 18 సంవత్సరాలుగా జిబ్రాన్ తో చిన్మయికి మంచి స్నేహం ఉంది. ఇక ఆ కారణంగానే ఆయన ఒక పాట పాడాలని పిలవడంతో ఆ సినిమా ఏమిటి? ఆ సినిమా ఎవరు తీస్తున్నారు ? అనే విషయాలు ఏమీ తెలుసుకోకుండా స్టుడియోకి వెళ్లి పాట పాడేసింది. ఆ తర్వాత అది ద్రౌపది 2 కోసం అనే విషయం తెలిసింది. ఈ నేపథ్యంలోనే అసలు విషయం తెలుసుకున్న చిన్మయి జిబ్రాన్ తో స్నేహం కారణంగానే స్టుడియోకి వెళ్లి పాట పాడాను. ఒకవేళ ముందే తెలిసి ఉంటే ఐడియాలజీలో ఇన్ని విభేదాలు ఉన్నవాళ్లతో నేను పని చేసేదాన్ని కాదు అని చిన్మయి చెప్పుకొచ్చింది. దీంతో మోహన్ జీ మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఆమె తన సినిమాకు నెగిటివ్ పబ్లిసిటీ చేస్తోంది అంటూ అందుకే తన సినిమాలో ఆమె పాడిన పాటను తీసివేసి వేరొకరితో పాడించబోతున్నాను అని స్పష్టం చేశారు. ఏది ఏమైనా ఇప్పుడు ఈ విషయాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

## ఆ విషయంలో పోటీ పడుతున్న చిరు, చరణ్..!




ఈ మధ్య కాలంలో సినిమాలకు బజ్ క్రియేట్ చేయడంలో పాటలు ముఖ్య పాత్రను పోషిస్తున్నాయి. అందుకే సినిమా విడుదలకు కొన్ని నెలల ముందు నుంచే పాటలను ఒకొక్కటిగా విడుదల చేయడం మనం చూస్తూ ఉన్నాం. పాటలను విడుదల చేస్తూ సినిమాకు బజ్ క్రియేట్ చేయడంలో ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఒక పాట హిట్ అయితే సినిమాకు మంచి ఓపెనింగ్స్ వస్తాయి. గతంలో పలు సందర్భాల్లో ఈ విషయం నిరూపితం అయ్యింది. సినిమా ఫలితంతో సంబంధం లేకుండా మినిమం బజ్ క్రియేట్ కావడంతో మంచి ఓపెనింగ్స్ దక్కించుకున్న సినిమాలు చాలానే ఉన్నాయి. అందుకే మొదటి సింగిల్, రెండో సింగిల్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన మీసాల పిల్ల, చికిరి సాంగ్స్ ఆయా సినిమాలపై అంచనాలు ఏ స్థాయిలో పెంచాయో మనం చూస్తూనే ఉన్నాం.

**చిరంజీవి మన శంకరవర ప్రసాద్ గారు...** మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న మన శంకరవర ప్రసాద్ గారు సినిమా 2026 సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. సినిమాకు దాదాపుగా అయిదు వారాల సమయం ఉంది. ఇప్పటికే సినిమాకు పాజిటివ్ బజ్ క్రియేట్ అయింది. అందుకు కారణం మీసాల పిల్ల అనడంలో ఎలాంటి సందేహం లేదు. మీసాల పిల్ల భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో సినిమాను చూడాలని కోరుకుంటున్న వారి సంఖ్య పెరిగింది. దాదాపు రెండు నెలల క్రితం వచ్చిన మీసాల పిల్ల పాటకు అప్పుడే యూట్యూబ్ ద్వారా ఏకంగా 77 మిలియన్ వ్యూస్ నమోదు అయ్యాయి. వేలాది మంది ఈ పాటకు రీల్స్ చేయడం కూడా జరిగింది. దాంతో పాట గత రెండు నెలలుగా వైరల్ అవుతూనే ఉంది. ఎక్కడో ఒక చోట ఈ పాట వినిపిస్తూనే ఉంది. ఈ సినిమాకు భీమ్స్ సిసిరియోల్ సంగీతాన్ని అందిస్తున్న విషయం తెల్సిందే.

**రామ్ చరణ్ పెద్ది సినిమా చికిరి...** ఇక ఈ మధ్య కాలంలో ప్రముఖంగా వినిపిస్తున్న పాటల్లో చికిరి ఒకటి. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న పెద్ది సినిమా నుంచి వచ్చిన మొదటి సింగిల్ చికిరి కి ఓ రేంజ్‌లో పాజిటివ్ రెస్పాన్స్ దక్కింది. సినిమాలో చరణ్ ఎలా ఉండబోతున్నాడు, హీరోయిన్ జాన్వీ కపూర్‌ను ఎలా చూపించబోతున్నారు అనే విషయాలను చూపిస్తూ చరణ్ డాన్స్ మూవ్స్ ను అద్భుతంగా చూపించడంతో పాటకు మంచి స్పందన వచ్చింది. యూట్యూబ్‌లో ఈ పాట విడుదలై కేవలం నెల రోజులు అయింది. ఇంకా చెప్పాలంటే నెల రోజులకు రెండు మూడు రోజులు తక్కువే అయింది. అయినా ఇప్పటికే పాట ఏకంగా 84 మిలియన్‌ల వ్యూస్‌ను దక్కించుకుంది. యూట్యూబ్ లో ఈ పాట సాధిస్తున్న వ్యూస్ ను చూసి అంతా షాక్ అవుతున్నారు. అదే సమయంలో సినిమాకు బజ్ విపరీతంగా పెరుగుతోంది.

**మీసాల పిల్ల వర్సెస్ చికిరి సాంగ్...** ఇతర సినిమాల పాటలు ఈ రెండు సినిమాల పాటలకు ఆమడ దూరంలో ఉన్నాయి. మూడో స్థానంలో రాజాసాబ్ సినిమా నుంచి వచ్చిన రెబల్ సాబ్ పాట ఉంది. ఆ పాటకు యూట్యూబ్‌లో ఇప్పటి వరకు 20 మిలియన్‌ల వ్యూస్ నమోదు అయ్యాయి. మొన్నటి వరకు టాప్ లో ఉన్న మీసాల పిల్ల పాటను చికిరి సాంగ్ వచ్చి రెండో స్థానంకు నెట్టి వేసింది. తక్కువ సమయంలోనే చికిరి సాంగ్ మీసాల పిల్ల రికార్డ్ వ్యూస్ ను బ్రేక్ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ఏఆర్ రెహమాన్ సంగీత సారధ్యంలో వచ్చిన చికిరి సాంగ్ కి యూత్ లో మంచి స్పందన దక్కింది. అందుకే ఎక్కడ చూసినా, ఎక్కడ విన్నా చికిరి అంటూ స్టెప్స్ వేస్తున్నారు. యూట్యూబ్‌లో చికిరి, మీసాల పిల్ల పాటలు పోటీ పడుతున్నాయి. చిరు మూవీ సంక్రాంతికి రానుండగా, పెద్ది సినిమా మాత్రం సమ్మర్ ప్రారంభంలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మరి ఈ రెండు సినిమాలు వసూళ్ల విషయంలో పోటీ పడుతాయా అనేది చూడాలి.

## అదృష్టం అంటే ఈ తెలుగమ్మాయిదే!

కొందరికి సినిమా అవకాశాలు అన్నవి అనుకోకుండా వస్తాయి. కెరీర్ ప్లానింగ్ లో సినిమా లేకపోయినా? అనూహ్యంగా వచ్చిన అవకాశాలతో ఈ రంగంలో స్థిరపడిన వారు చాలా మంది ఉన్నారు. నటుడు రాహుల్ రామకృష ఇండస్ట్రీలో ఎలాంటి ప్రయత్నాలు చేయకుండానే సక్సెస్ అయ్యాడు. టాలీవుడ్ లో స్థిరపడ్డాడు. అర్జున్ రెడ్డి చిత్రం అతడి జీవితాన్నే మార్చేసింది. ఇంకా ఇలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారు. తెలుగు అమ్మాయి శివానీ నాగరం కడూఆ అలాగే క్లిక్ అయినట్లు తెలిపింది. శివానీ సినిమాల్లోకి రావాలని ముందెప్పుడు అనుకోలేదంది. ఓ షార్ట్ ఫిల్మ్ కోసం తొలిసారి కెమెరా ముందుకొచ్చింది. ఆ గుర్తింపు తోనే సినిమా అనే థాట్ మనసులో మొదలింది. అటుపై అంబాజీ పేట మ్యారేజ్ బ్యాండ్ లో ఛాన్స్ అందుకుంది. ఆ చిత్ర దర్శక, నిర్మాతలు యూ ట్యూబ్ లో చూసి అమ్మడిని అప్రోచ్ అవ్వడం..పాత్రకు సెట్ అవుతుందని భావించి



ఎంపిక చేసారు. తొలి సినిమా షూటింగ్ సమయం లో చాలా టెన్షన్ పడింది. కానీ ఇప్పుడా టెన్షన్ పోయి నటిగా ధైర్యంగా పని చేస్తోంది. ఆ తర్వాత నటించిన లిటిల్ హార్ట్స్ కూడా మంచి విజయం అందుకుంది. ప్రస్తుతం కొత్త అవకాశాలు బాగానే వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాలమే తనని స్టార్ గా మార్చిందని..తనని తాను ఎప్పుడూ అలా ఊహించుకోలేదంది శివానీ. తాను నటిని అయినా బ్యూటీ విషయంలో చాలా సింపుల్ గా ఉంటానంది. చర్మ సంరక్షణ కోసం క్రీమలు వాటికి దూరంగా ఉంటానంది. వీలైనంత వరకూ నేచురల్ గా కనిపించడానికి ఇష్టపడతానంది. శరీరానికి కావాల్సినన్నీ నీళ్లు మాత్రం క్రమం తప్పకుండా తాగుతానంది. రాత్రి సమయంలో మాత్రం మాయిశ్చరైజర్ తప్పనిసరిగా వాడుతానంది. వారానికి ఒకసారి చర్మానికి పెసరడిండి మాత్రం రాస్తానంది. ఇక టాలీవుడ్ లో నటీమణుల మధ్య ఎలాంటి కాంపిటీషన్ ఉందన్నది తెలిసిందే. ఒక్క ఛాన్స్ కోసం ఎంతో మంది క్యూలో ఉన్నారు. స్థానిక భామలతో పాటు ముంబై, చెన్నై, కేరళ, బెంగుళూరు ప్రాంతాల నుంచి దిగుమతి అవుతోన్న వారి సంఖ్య అంతకంతకు కనిపిస్తోంది. సాధారణంగా తెలుగు హీరోయిన్లకు అవకాశాలివ్వడానికి దర్శక, నిర్మాతలు కూడా ముందుకు రారు. స్థానిక నటులతో కొన్ని రకాల సమస్యలు ఉత్పన్నమవుతాయని భయం కూడా ఓ కారణం.

వాటన్నింటిని బ్రేక్ చేసి శివానీ ఛాన్సులు అందుకుంటుంది. ఇంత వరకూ గ్లామర్ పాత్రల్లో నటించలేదు. మరి ఆ తరహా పాత్రల విషయంలో శివానీ ఎలా స్పందిస్తుందో చూడాలి.

## జాన్వీకి పెరుగుతున్న మద్దతు.. ఇప్పటికైనా మార్పు వస్తుందా?

డిజిటల్ యుగంలో కూడా లింగ సమానత్వం కోసం పోరాడాల్సి వస్తోంది అంటూ కొంతమంది నటీమణులు చేస్తున్న కామెంట్లు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. సాధారణంగా ఒకప్పుడు మహిళలు అంటే వంటగదికే పరిమితమయ్యేవారు. కానీ కాలం మారుతున్న నేపథ్యంలో మహిళలు ప్రతి రంగాలలో ముందుంటున్నారు. అంతేకాదు అంతరిక్షానికి కూడా వెళ్లి తమ సత్తా ఏంటో నిరూపిస్తున్నారు. ఇక ఒక్కటేమిటి పురుషుడితో సమానంగా పోటీపడుతూ దూసుకుపోతున్న ఈ డిజిటల్ యుగంలో కూడా మహిళలకు సరైన గౌరవం లభించడం లేదు అని, పురుష అహంకారం ఎక్కువవుతోంది అంటూ జాన్వీ కపూర్ కామెంట్లు చేసిన విషయం తెలిసిందే. ముఖ్యంగా సమానత్వం కోసం ఇప్పుడు పోరాడగలిగితేనే వచ్చే జనరేషన్ కైనా ఈ ఇబ్బందులు ఉండవు అని ఆమె తన అభిప్రాయంగా చెప్పుకొచ్చింది. అయితే ఇప్పుడు ఆమె అభిప్రాయానికి అండగా నిలిచారు గ్లోబల్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా. లింగ సమానత్వం కోసం మాత్రమే కాదు ఇలా పోరాడే వారికి కూడా మద్దతుగా నిలవాలి అంటూ చెప్పుకొచ్చింది. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.



బాలీవుడ్ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న జాన్వీ కపూర్ శ్రీదేవి, బోనీకపూర్ వారసురాలిగా సినీ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఒకవైపు నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంటున్న ఈమె.. మరొకవైపు సినీ ఇండస్ట్రీలో మహిళలు ఎదుర్కొంటున్న విషయాలపై కూడా స్పందిస్తోంది. విషయంలోకి వెళ్తే.. తాజాగా ముంబై వేదికగా జరిగిన “వీ ది విమెన్ ఆసియా” కార్యక్రమంలో జాన్వీ మాట్లాడుతూ.. “మహిళగా పుట్టడాన్ని నేను గౌరవంగా భావిస్తున్నాను. సమానత్వం అనేది మాటలతో, చర్చల తోనే ప్రారంభమవుతుంది. మనం ఈ అంశం గురించి ఇప్పటికైనా ఓపెన్ గా మాట్లాడితేనే మన తర్వాత తరానికైనా దీనిపై పూర్తి అవగాహన వస్తుంది. నేను మహిళగా పుట్టినందుకు గర్వపడుతున్నాను. మనల్ని మనం ప్రశంసించుకుంటూ ముందుకు సాగాలి. మహిళలు శక్తిమంతులు. వారిని ప్రోత్సహిస్తే.. అద్భుతాలు సృష్టిస్తారు” అంటూ జాన్వీ కపూర్ తెలిపింది.

జాన్వీ కపూర్ మాట్లాడిన ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో ఈ వీడియోని తన ఇన్స్టాగ్రామ్ స్టేటస్ ద్వారా షేర్ చేస్తూ “ఇలా మాట్లాడే వారిని కూడా ప్రోత్సహించాలి” అంటూ గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా కామెంట్ చేసింది. జాన్వీ కపూర్ మాటలకు గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా మద్దతుగా నిలవడంతో అందరూ ప్రశంశలు కురిపిస్తున్నారు. అంతేకాదు ఇప్పటికైనా ఇండస్ట్రీలో మార్పు రావాలి అని కామెంట్లు చేస్తున్నారు.



# అసెంబ్లీపై కేటీఆర్ హాట్ కామెంట్స్..

జనగామ, జనవరి 6: తెలంగాణ అసెంబ్లీ నడుస్తున్న తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాట్ కామెంట్స్ చేశారు. అసెంబ్లీ గౌరవ సభ కాదని.. కౌరవ సభ అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. శాసనసభ బూతుల సభగా మారిందని మండిపడ్డారు. మంగళవారం నాడు జనగామలో పర్యటించిన కేటీఆర్.. పార్టీ కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. ఃకుటుంబం అన్నాక గొడవలు ఉంటాయని.. అలుగుడు గులుగుడు ఉంటది, సర్దుకుపోవాలన్నారు. లేదంటే.. కాంగ్రెస్ వాళ్లకు సందు దొరుకుతదిః అని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి నిస్సిగ్గుగా ఇచ్చిన హామీలన్నింటినీ మర్చిపోయారని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్‌ను ఉరి తీయాలని రేవంత్ రెడ్డి అన్న కామెంట్స్‌ని ప్రస్తావించిన కేటీఆర్.. చావునోట్లో తలపెట్టి తెలంగాణను తెచ్చినందుకు కేసీఆర్‌ను ఉరి తీయాలా? అని ప్రశ్నించారు. ఇదే సమయంలో రైతుల అవస్థలను కూడా కేటీఆర్ ప్రస్తావించారు. యాప్‌అబ్రశ్రీశ్రీలో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటూ ఘాటైన వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీ లీడర్ కాదని.. రీడర్ అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. వరంగల్‌లో రైతులకు ఇచ్చిన హామీ ఏమైందని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను మరిచిన రాహుల్ గాంధీని ఉరితీయాలని కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.




హైదరాబాద్: కాలుష్యం తగ్గాలంటే ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాలని భాజపా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి అన్నారు. తెలంగాణ శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్రం సబ్సిడీ ఇస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా అలా ఇస్తోందా? అని ప్రశ్నించారు. "ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈవీలను తక్కువగా వినియోగిస్తున్నారు. రాష్ట్రం మొత్తంపై ఆ తరహా వాహనాలు 70 వేలే నడుస్తున్నాయి. కాలుష్యం తగ్గాలంటే ఈ సంఖ్య పెరగాలి. రోడ్ ట్యాక్స్, వెహికిల్ ట్యాక్స్ మినహాయిస్తూ ప్రభుత్వం ప్రోత్సహించాలి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఎలక్ట్రిక్ వాహనాలు వాడాలి. ప్రభుత్వం ఆ దిశగా కృషి చేయాలి" వెంకట రమణారెడ్డి అన్నారు.

**పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇవ్వాలి: పాల్వాయి హరీశ్‌బాబు...** త్రీవీలర్, ఫోర్ వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలను ప్రభుత్వ ప్రోత్సహించాలని మరో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. హైదరాబాద్‌ను కాలుష్య రహితంగా మార్చాలంటే ఈవీలను వాడాలని చెప్పారు. వినియోగం పెరిగేందుకు పెద్ద ఎత్తున సబ్సిడీలు కల్పించాలని.. పార్కింగ్ స్థలాల్లో ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈవీ పాలసీ తీసుకొస్తున్నందుకు ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## ఆ అక్రమ నిర్మాణాలను తొలగించాలి.. సీఎం రేవంత్‌కి కిషన్‌రెడ్డి లేఖ

ఢిల్లీ, జనవరి 6 : తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఇవాళ(మంగళవారం) లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా వరంగల్ కోట భూములను భారత పురావస్తుశాఖకు చెందినవిగా గుర్తించాలని సూచించారు. కోట భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. కోట భూముల్లోని ఆక్రమణదారులను తొలగించడం గురించి ఈ లేఖలో ప్రస్తావించారు.దాదాపు 250 సంవత్సరాలపాటు కాకతీయుల రాజధానిగా కీర్తిగడించి ఘనమైన చారిత్రక నేపథ్యం, సాంస్కృతిక వైభవంతో అలరారిన ఓరుగల్లు (వరంగల్) పట్టణం.. తెలంగాణ వారసత్వ సంపదకు నిలయంగా విరాజిల్లుతోందని వ్యాఖ్యానించారు కిషన్‌రెడ్డి. కాకతీయుల కాలంలో ఇతర రాజ్యాల నుంచి ఎదురయ్యే దండయాత్రల నుంచి రాజధానికి రక్షణ కల్పించటం కోసం ఒక ప్రణాళిక ప్రకారం 7 ప్రాకారాలతో వరంగల్ కోటను ఎంతో పకడ్బందీగా నిర్మించారని పేర్కొన్నారు. ఢిల్లీ సుల్తానులు, హైదరాబాద్ నవాబుల దాడులను ఎదుర్కొన్న కోటని అభివర్ణించారు. నేటికీ కాకతీయుల శౌర్య పరాక్రమాలకు ప్రతీకగా నిలిచిందని చెప్పుకొచ్చారు. ప్రతిరోజూ వేలాదిమంది పర్యాటకులు ఈ కోటను సందర్శించి కోటలో దాగి ఉన్న శిల్ప సంపద, నిర్మాణ నైపుణ్యం, వందలాది ఆలయాలు, వాటి నేపథ్యం, కోట ప్రాధాన్యం గురించి తెలుసుకుంటున్నారని వెల్లడించారు కిషన్‌రెడ్డి. పర్యాటకులను మరింతగా ఆకర్షించేందుకు కేంద్రప్రభుత్వం ఇటీవలే సౌండ్, ఇల్యూమినేషన్ లైటింగ్ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసిందని వివరించారు. ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో ఉన్న వరంగల్ కోట పరిరక్షణకు, నిర్మాణాల పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం నిరంతరం చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఎంతో చారిత్రక నేపథ్యం కలిగిన ఈ వరంగల్ కోటకు చుట్టూ ఉన్న 7



ప్రాకారాల్లో ప్రస్తుతం 3 ప్రాకారాలు మాత్రమే మిగిలి ఉన్నాయని తెలిపారు కిషన్‌రెడ్డి. ఈ 3 ప్రాకారాలతో పాటు ఇతర ప్రాకారాలను కొంతమంది స్థానికులు ఆక్రమించి కోట భూముల్లో అనేక అక్రమ కట్టడాలు నిర్మించారని వెల్లడించారు. వరంగల్ కోటాూా× అధీనంలో ఉన్న ఒక స్మారక ప్రదేశమని, దీనికి సంబంధించిన భూములను ఆక్రమించడం, అందులో అక్రమంగా నిర్మాణాలను నిర్మించడం చట్టరీత్యానేరమని చెప్పుకొచ్చారు. వెంటనే ఆక్రమించిన భూములను ఖాళీ చేయాలని కోరుతూ అధికారులు ఆక్రమణదారులకు పలుమార్లు నోటీసులు ఇచ్చారని ప్రస్తావించారు కిషన్‌రెడ్డి. ఇదే విషయాన్ని తెలియజేస్తూ తాను కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రిగా ఉన్న సమయంలోాూా× అధికారులు 04.11.2022న అలాగే, ఇటీవల 01.12.2025న వరంగల్ జిల్లా కలెక్టర్‌కి పలుమార్లు లేఖలు రాశానని గుర్తుచేశారు. తాను లేఖ రాసిన కోట భూములను పరిరక్షంచటానికి వరంగల్ జిల్లా కలెక్టర్ ఎటువంటి చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

## 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంగా పని చేస్తున్నాం: మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికల్లా 3 ట్రిలియన్ డాలర్లకు తీస్కుళ్లాలనే దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుతున్నామని ఐటీ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. శాసనమండలిలో ఆయన మాట్లాడారు. పెట్టుబడిదారులకు సులువుగా ఉండే విధంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాన్ని తీసుకొచ్చామన్నారు. తెలంగాణ రైజింగ్ సదస్సులో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ఈనెల 19న మరోసారి వరల్డ్ ఎకనమిక్ సమిట్‌కు వెళుతున్నామని, భారీగా పెట్టుబడులు తీసుకొస్తామని విశ్వాసం వ్యక్తం చేశారు.






# హైదరాబాద్-విజయవాడ హైవేపై ఎన్నాళ్లీ విస్తరణ పనులు?

**హైదరాబాద్-విజయవాడ రహదారిపై ప్రయాణమంటేనే ప్రజలు హడలిపోతున్నారు. కారణం.. మూడేళ్ల క్రితం చేపట్టిన ఆరు లేన్ల విస్తరణ పనులు నత్త నడకన సాగతుండటమే! అనేక చోట్ల పనులు అసంపూర్తిగా వదిలేయడంతో నగరంలో పనామా కూడలి నుంచి అబ్దుల్లాపూర్ మెట్ వరకు ప్రయాణం ప్రమాదభరితంగా మారింది. ఈ మార్గంలో రోడ్డు దాటడానికి ప్రజలు బెంబేలిత్తిపోతున్నారు. ఈ రహదారిపై ప్రమాదాల బారిన పడి పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. సంక్రాంతి సమీపిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ రహదారి విస్తరణ పనుల్లో నిర్లక్ష్యం మరింత ఆందోళన కలిగిస్తోంది.**



## సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ ఆరా

ఢిల్లీ , జనవరి 6: కాంగ్రెస్ పార్లమెంటరీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఇవాళ (మంగళవారం) అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆమెను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆస్పత్రిలో చేర్పించారు. సోనియాగాంధీ తీవ్రమైన దగ్గుతో బాధపడుతోండటంతో ఆమెను వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. ఈ నేపథ్యంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరా తీశారు. ఏఐసీసీ పెద్దలకు ఫోన్ చేసి సోనియా గాంధీ ఆరోగ్యపరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. సోనియా ఆరోగ్యం నిలకడగా ఉందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

**అనారోగ్యానికి కారణం కాలుష్యమేనా..** కాగా, ఆస్పత్రి వర్గాల సమాచారం ప్రకారం.. సోనియా గాంధీకి సీనియర్ పల్మనాలజిస్ట్ పర్యవేక్షణలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి స్థిరంగానే ఉన్నట్లు తెలుస్తోంది. ఢిల్లీలో నెలకొన్న తీవ్ర వాయు కాలుష్యం కారణంగానే సోనియా గాంధీకి ఈ అనారోగ్య పరిస్థితి ఏర్పడినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

కాలుష్య స్థాయిలు పెరగడంతో శ్వాసకోశ సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని వైద్యులు సూచించారు.

**వైద్యుల పర్యవేక్షణలో చికిత్స..** వైద్యుల సూచనల మేరకు సోనియాగాంధీకి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా వైద్యులు గమనిస్తున్నట్లు సమాచారం.

కాగా గతంలోనూ సోనియాగాంధీ పలు ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే.

## 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్: భట్టి విక్రమార్క

హైదరాబాద్: సింగరేణి కార్మికుల సంక్షమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ ల్యాబ్ ప్రారంభిస్తామని చెప్పారు. సింగరేణిపై శాసనసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. "32 మంది వైద్యుల కోసం నోటిఫికేషన్ ఇచ్చాం. త్వరలో భర్తీ చేస్తాం. 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతోంది. సింగరేణి ఆస్పత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీలను భర్తీ చేస్తాం. విశ్రాంత ఉద్యోగులు అక్కడ మందులు అందించేలా చర్యలు చేపడతాం" అని భట్టి విక్రమార్క తెలిపారు.



## ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల పెంపునకు చర్యలు: పొన్నం

హైదరాబాద్ : భవిష్యత్ తరానికి మంచి జీవితాన్ని అందించడమే లక్ష్యంగా జీవో 41 ద్వారా ఈవీ పాలసీని తీసుకువచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంగళవారం నాడు అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈవీ పాలసీ, ఆర్టీసీకి సంబంధించిన అంశాలపై చర్చ జరిగింది. దీనిపై పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సమాధానం ఇచ్చారు. గడిచిన సంవత్సర కాలంలో లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుపోయాయని మంత్రి తెలిపారు. ఈవీలు గతంలో ఒకసారి ఛార్జింగ్ చేస్తే 150 కిలోమీటర్ల రేంజ్ వచ్చేదని.. ఇప్పుడు 500 కిలోమీటర్లు ప్రయాణించే పాసిటీ వాహనాలు వచ్చాయని వివరించారు. ఈ పాసిటీని మరింత పెంచడానికి సమీక్షలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. అలాగే ఛార్జింగ్ స్టేషన్‌లను పెంచానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు మంత్రి పొన్నం. ఇటీవల ఎలక్ట్రిక్ వాహనాల తయారీదారులు, డీలర్లతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ఈవీలు గణనీయంగా పెరిగాయన్నారు. రెడ్కో సంస్థల ద్వారా ఛార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన వాహనాలు, పాఠశాల బస్సులు, ఫార్మా, ఐటీ వాహనాలు 25- 50 శాతం వారి అవసరాలు బట్టి ఈవీ వాహనాలు కొనేలా విధానం తీసుకురాబోతున్నామని మంత్రి తెలిపారు. ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ చూస్తే అక్కడ గాలిలో ప్రమాదకరమైన బ్యాక్టరీయా ఉన్నట్లు తెలుస్తుందన్న మంత్రి.. హైదరాబాద్‌లో ఢిల్లీ లాంటి ప్రమాదకర పరిస్థితి రాకుండా ఉండడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈవి పాలసీ ద్వారా ఈవి, CNG, LPG వాహనాల వినియోగం పెంచుతున్నామన్నారు. పీఎం ఈ -డ్రైవ్ కింద 2,800 బస్సులు



దశల వారీగా వస్తున్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు. వరంగల్ మున్సిపాలిటీకి 100, నిజామాబాద్ మున్సిపాలిటీ 50 ఎలక్ట్రిక్ బస్సులు రాబోతున్నాయని మంత్రి పొన్నం ప్రకటించారు. మనం వాడే వాహనాలు కూడా ఈవిలు వాడేలా చూసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. అన్ని కలెక్టరేట్లలో, రెస్టారెంట్లలో, టూరిజం స్పాట్లలో ఛార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ బాగుండేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. హైదరాబాద్‌లో 200 ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ దాటుతుందని.. ఢిల్లీలో 400 దాటిందన్నారు. కాలుష్య నివారణకు ప్లాంటేషన్ పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. అలాగే ఈవిల వినియోగం పెంచాలని.. ఈవీల వినియోగంలో దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్‌గా ఉండాలన్నారు. రాబోయే తరానికి కాలుష్య రహిత తెలంగాణ అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్.




## కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యమేమీ లేదు: మల్‌రెడ్డి రంగారెడ్డి

హైదరాబాద్, జనవరి 6: ఎమ్మెల్సీ కవితపై కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఇంట్రస్టింగ్ కామెంట్స్ చేశారు. ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి స్వీట్ వార్నింగ్ కూడా ఇచ్చారు. మరి ఇంతకీ ఆయన ఎందుకు అలా అన్నారు.. సొంత పార్టీకే ఎందుకు వార్నింగ్ ఇచ్చారు.. పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం.. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్‌రెడ్డి రంగారెడ్డి మంగళవారం నాడు మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న కవిత ఎపిసోడ్‌పై స్పందించారు. కల్వకుంట్ల కవిత కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదన్నారాయన. దానం నాగేందర్, కడియం శ్రీహరి తమ పార్టీలోకి వస్తారని ఊహించలేదని.. చివరికి వారు వచ్చారు కదా అని ఉదహరించారు మల్‌రెడ్డి. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీకి కూడా చిన్నపాటి వార్నింగ్ ఇచ్చారు. మల్‌రెడ్డి రంగారెడ్డి ఎప్పటి నుంచో మంత్రి పదవి ఆశిస్తున్నారు. హైదరాబాద్ కోటాలో తనకు మంత్రి పదవి ఇవ్వాలని పలుమార్లు బహిరంగంగానే అడుగుతూ వచ్చారు. ఇప్పుడు కూడా అదే అంశాన్ని ఆయన ప్రస్తావించారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం కలుగుతుందని పరోక్షంగా వార్నింగ్ ఇచ్చారు. పార్టీ పెద్దలు ఆలోచించాలని కోరారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న జిల్లాకు ఇంత వరకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. రంగారెడ్డి జిల్లా పేరు మార్పుపైనా ఆయన స్పందించారు. పేరు మార్పు తనకు ఇష్టం లేదన్నారు. రంగారెడ్డి జిల్లా పేరు మార్పు అనేది కేవలం ఊహాగానమే అని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చని.. జిల్లా స్వరూపం మాత్రం మారొద్దని ప్రభుత్వాన్ని మల్‌రెడ్డి కోరారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ భూమ్ పెరిగిందన్నారు. భూముల రేట్లు పెరుగుతున్నాయని భూములు ఎవరూ అమ్మడం లేదన్నారు. ఫార్మాసిటీపై పోరాటం చేసినందుకే గతంలో తనను కేసీఆర్ ఓడగొట్టారని మల్‌రెడ్డి చెప్పారు. నాటి ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం ఫార్మాసిటీ వచ్చి ఉంటే 50 కిలోమీటర్ల మేర పొల్యూషన్ అయ్యేదన్నారు.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com